


# నేటి నిజం

తెలుగు దినపత్రిక


website2:www.netinijam.com E-mail : netinijam93@gmail.com






హైదరాబాద్ శనివారం 16-9-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :30 సంచిక:38 పేజీలు:6 వెల: రూ.1/-




# తన గోతిని తానే తవ్వుకోవద్దు - ఓజోన్ పొరను తరగనివ్వొద్దు

## (16 సెప్టెంబర్ 'అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినం' సందర్భంగా)

పర్యావరణంలోని స్ట్రాటోవరణంలో (15-35 కిమీ దూరాన) సహజ రసాయన ప్రక్రియల్లో ఏర్పడిన ఓజోన్ పొర గొడుగులా పని చేస్తూ, సూర్యకాంతిలోని ప్రమాదకర అతినీలలోహిత కిరణాలను శోషణం చేసుకొని ప్రాణులకు ప్రయోజనకరమైన సూర్యరశ్మిని భూఉపరితలంపై పడేలా పనిచేయడంతో మానవాళితో పాటు సకల జీవకోటి కూడా పరిరక్షించబడుటకు సదవవకాశం లభించింది. ఆధునిక శాస్త్రసాంకేతిక ప్రగతి పరుగుల్లో మునిగి తేలుతున్న నవ్య మానవాళి స్వల్పకాలిక ప్రయోజనాల వలలో చిక్కి అనాలోచితంగా/స్వార్థపూరితంగా చేపట్టిన కార్యాలతో ఓజోన్ పొర క్రమంగా తరుగుతున్నట్లు 1970ల్లోనే శాస్త్రజ్ఞులు గమనించారు. ఓజోన్ పొర తరిగితే ప్రాణికోటి ఆరోగ్యకర మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని తెలుసుకోవాలి. సూర్యరశ్మి లేకుండా జీవరాసుల మనుగడ ఉండదు. కాని సూర్యకాంతిలోని అతినీలలోహిత కిరణాలు భూమిని చేరితే వృక్షజంతు జీవులు పలు తీవ్ర అనారోగ్యాల బారినపడి మనుగడ సాగించడం కష్టం అవుతుంది. త్రిపరమాణుక ఆక్సీజన్ అణువును (03) ఓజోన్ అంటాం.

### అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినం-2023:

ఓజోన్ పొర పరిరక్షణకు అంతర్జాతీయ సమాజం నడుబించాలని పిలుపునిచ్చిన మాన్‌ట్రేయల్ ప్రోటోకాల్ 16 సెప్టెంబర్ 1987న తీర్మానించింది. ఈ చారిత్రక నిర్ణయానికి గుర్తుగా 1994లో ఐరాస నిర్ణయం ఆధారంగా ప్రతి ఏట 16 సెప్టెంబర్‌న ప్రపంచ దేశాలు 'అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినం' పాటించడం ప్రారంభించారు. 'వాతావరణ మార్పులను తగ్గించడానికి ఓజోన్ పొరను సంరక్షిద్దాం (ఫిక్సింగ్ ది ఓజోన్ లేయర్ అండ్ రెడ్యూసింగ్ క్లైమెట్ ఛేంజ్)' నినాదంతో ప్రపంచ దేశాలు ఓజోన్ పొరను పరిరక్షించాల్సిందే. ఓజోన్ పొర కారణంగా భూగ్రహంపై సమస్త జీవరాసుల మనుగడ సాధ్యం కావడంతో పాటు జీవ వైవిధ్య పరిరక్షణ కూడా జరుగుతుందని గమనించాలి. ఓజోన్ పొర పలుచబడడం వల్ల పలు తీవ్ర అనారోగ్య సమస్యలు, జీవావరణ వ్యవస్థకు భంగం వాటిల్లడం, వాతావరణ ప్రతికూల మార్పులకు ఆజ్యం పోయడం జరుగుతుందని హెచ్చరిస్తున్నారు.

### ఓజోన్ పొర పలుచబడటానికి ప్రధాన కారణమైన రసాయనాలు:

ద్విపరమాణుక ఆక్సీజన్ అణువు ($O_2$) ప్రాణవాయువుగా ఉపయోగపడుతున్నది. నవజాత ఆక్సీజన్ పరమాణువుకు ($O$) స్వయం ప్రతిపత్తి, మనుగడ ఉండదని తెలుసుకోవాలి. ద్విపరమాణుక ఆక్సీజన్ ($O_2$), త్రిపరమాణుక ఓజోన్ ($O_3$)లను విభిన్న ఆక్సీజన్ రూపాంతరాలుగా గుర్తించాలి. ఓజోన్ పొర పలుచబడటానికి దాదాపు 100కు పైగా మానవ నిర్మిత రసాయనాలు కారణమని నిపుణులు తేల్చారు. కార్బన్ పరమాణువులతో ఫ్లోరిన్, క్లోరిన్, బ్రోమిన్, ఐయోడిన్ పరమాణువులు కలిసినపుడు ఏర్పడే రసాయనాలను హాలో కార్బన్స్ అంటాం. హాలో కార్బన్లకు ఓజోన్ పొరను తగ్గించే ధర్మం ఉంటుంది. మిథైల్ బ్రోమైడ్, మిథైల్ క్లోరోఫామ్, కార్బన్ టెట్రాక్లోరైడ్, హాలోన్స్, క్లోరోఫ్లోరో కార్బన్లు (సియఫ్‌సిలు), హైడ్రోక్లోరోఫ్లోరోకార్బన్లు (హెచ్‌సియఫ్‌సిలు) మె?దలగు పలు మ్యాన్-మేడ్ రసాయనాల వల్ల ఓజోన్ పొరకు ప్రమాదం ఏర్పడుతున్నది. రిఫ్రజిరేషన్, ఏయిర్ కండీషనర్లు, ద్రావణులు, ప్రొపెల్లెంట్స్, ఫోమ్-బ్లోయింగ్ ఏజంట్ల తయారీలో వాడబడే రసాయనాలతో ఓజోన్ పొర పలుచబడటంతో పాటు కొన్ని ప్రాంతాల్లో చిల్లులు (ఓజోన్ హోల్) పడ్డట్లు గమనించారు. ఓజోన్ పొర పలుచబడినపుడు అతినీలలోహిత కిరణాలు భూమిపై చేరి మానవాళికే కాకుండా జంతువులకు చర్మ కాన్సర్, కాటరాక్ట్ లాంటి పలు అనారోగ్యాలు కలుగుతాయి. ఈ ప్రమాదకర కిరణాలు హరిత క్షేత్రాలపై పడినపుడు పంటలకు హాని, పర్యావరణానికి ప్రమాదం ఏర్పడుతుంది.

### ఓజోన్ పొర పరిరక్షణకు ప్రపంచ దేశాల ప్రతినలు:

ఓజోన్ పొర పరిరక్షణకు అంతర్జాతీయ సమాజం నడుం బిగించాలనే సదుద్దేశంతో 22 మార్చి 1985న 28 దేశాలు 'వియన్నా కన్వెన్షన్' తీర్మానంపై సంతకాలు చేశారు. వియన్నా కన్వెన్షన్ పునాదిగా చేసుకొని 16 సెప్టెంబర్ 1987న ఓజోన్ పొరకు ప్రమాదకరంగా మారిన రసాయనాల ఉత్పత్తిని ప్రణాళికాబద్ధంగా, దశల వారీగా తగ్గించడానికి అంగీకరించిన ప్రపంచదేశాలు 'మాన్‌ట్రేయిల్ ప్రోటోకాల్'ను ఏకగ్రీవంగా ఆమోదించారు. అంతర్జాతీయ ఒప్పందం ప్రకారం అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలు ఓజోన్ పొరకు కారణమైన ప్రమాదకర రసాయనాల వాడకాన్ని క్రమంగా తగ్గించడం ప్రారంభించారు. ఓజోన్ పొర మనుగడకు అత్యంత ప్రమాదకరంగా మారిన సియఫ్‌సిలు, హాలోన్స్ తయారీ, వాడకాన్ని తొలి దశలో తగ్గించుటకు చర్యలు తీసుకుంటున్నారు. రెండవ దశలో హెచ్‌సియఫ్‌సిల వాడకాన్ని తగ్గించడానికి 1992లో నిర్ణయం తీసుకున్నారు. ఓజోన్ గొడుగుకు ప్రమాదకరంగా మారిన రసాయనాలను అభివృద్ధి చెందిన దేశాలు 2030 వరకు, అభివృద్ధి చెందుతున్న దేశాలు 2040 వరకు పూర్తిగా తగ్గించాలనే లక్ష్యం ఏర్పాటు చేశారు. ఈ దిశలో మాన్‌ట్రేయిల్ ప్రోటోకాల్ ప్రగతిని అధ్యయనం చేసి, హెచ్‌సియఫ్‌సిలను తగ్గించాలనే గట్టి సంకల్పాన్ని వ్యక్తం చేశారు. 15 అక్టోబర్ 2016న కిగాలీ, ర్వండాలో జరిగిన సమావేశంలో హెచ్‌యఫ్‌సిలను తగ్గించాలనిఏకగ్రీవంగ అంగీకరించారు. మాన్‌ట్రేయిల్ ఒప్పందం జరిగి మూడున్నర దశాబ్దాలు అవుతున్న వేళ ఓజోన్ పొర పరిరక్షణకు మరింత పట్టుదలతో చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ అంతర్జాతీయ ఒప్పందాలతో 99 శాతం ప్రమాదకర రసాయనాల ఉత్పత్తిని కట్టడి చేయగలగడం హర్షదాయకం. ఇలాగే దేశాలన్నీ కఠిన చర్యలు తీసుకున్నపుడు తరిగిన ఓజోన్ పొర తిరిగి ఏర్పడడం, జీవుల ప్రశాంత మనుగడకు బాటలు పడతాయి.

అత్యంత తెలివైన మానవుడు తన గోతిని తానే తవ్వుకోవద్దని, బతికితేనే ప్రగతి అని మరిచి పోవడం, మన నిర్లక్ష్యమే మన మనుగడను ప్రశ్నార్థకం చేస్తుందని గుణపాఠం తెచ్చుకోవాలి. ఎవరు నిలబడిన కొమ్మను వారే నరుక్కోవడం ఆత్మహత్యాసదృశం అవుతుంది. ఓజోన్ పొరను రక్షించుకుంటూ, మనం బతుకుతూ సకల ప్రాణికోటికి జీవితాన్ని ప్రసాదిద్దాం, పర్యావరణానికి పట్టం కడదాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## గణేష్ ఉత్సవాలకు ఇబ్బంది కలుగకుండా చర్యలు



ముషీరాబాద్ నియోజకవర్గంలో గురువారం అరగంట సేపు ఏకధాటిగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. జవహర్‌నగర్‌లో చెట్లు విరిగి పడింది. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే ముఠాగోపాల్ గారు మరియు యువ నాయకుడు ముఠా జై సింహగారు వినాయక మండపాలకు అడ్డంగా ఉన్న చెట్లు కొమ్మలను తొలగించమని ఆదేశాల మేరకు దగ్గరుండి పనిచేస్తున్న బిఆర్ఎస్ గాంధీనగర్ ఉపాధ్యక్షుడు ఎస్టి ప్రేమ్.

## గ్వాలియర్‌లోని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా గోదామును ఆకస్మికంగా తనిఖీ చేసిన కేంద్ర మంత్రి శ్రీ పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15:కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజాపంపిణీ, జౌళి మరియు వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ ఈరోజు గ్వాలియర్‌లోని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఈఅఎ) గోడౌన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 5.5 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న డిపో మొత్తం పనితీరును మంత్రి సమీక్షించారు. 15156 ఎంటీ నిల్వ సామర్థ్యం గల గిడ్డంగిలో ప్రస్తుతం 1199 ఎంటీ ఆహారధాన్యాలు ఉన్నాయి.

డిపోలో సమగ్ర భద్రత, నిల్వల సంరక్షణ, సంరక్షణ మరియు తరలింపు మొదలైన వాటి కోసం ఏర్పాటు చేసిన సిసిటివి కెమెరాల పనితీరును ఆయన ప్రశంసించారు. డిజిటల్ ఇండియాలో భాగంగా అమలు జరుగుతున్న ఆన్‌లైన్ సిస్టమ్ (ఆూా) డిపో ఆవరణ పరిశుభ్రత పట్ల మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా ప్రస్తుత ప్రమాణాలను కొనసాగించాలని కేంద్ర మంత్రి సూచించారు.

డిపో ఆవరణలో శ్రీ గోయల్ మొక్కలు నాటారు. భారత ఆహార సంస్థ మధ్యప్రదేశ్ ప్రాంతీయ జనరల్ మేనేజర్ శ్రీ వినేష్ గర్వలే,డివిజనల్ మేనేజర్-గ్వాలియర్ శ్రీ బల్వంత్ సింగ్, ఇతర అధికారులు శ్రీ రాజ్ కుమార్ శాక్య, మేనేజర్-పర్సనల్, శ్రీ సుమేర్ సింగ్ మీనా, మేనేజర్-డిపో, శ్రీమతి దీపా అహిర్వార్, మేనేజర్-ఖిఅ , శ్రీ పురాణ్ మల్ మీనా, మేనేజర్-డిపో, శ్రీ ఘనశ్యామ్ మీనా, మేనేజర్-డిపో మరియు ఇతర ఉద్యోగులు మరియు ఈఇూఅ-గ్వాలియర్ కార్మికులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నేషనల్ జుడీషియల్ డేటా గ్రిడ్ ప్లాట్‌ఫామ్ పరిధిలోకి సుప్రీంకోర్టు

### -సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్

న్యూఢిల్లీ సెప్టెంబర్ 15 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: నేషనల్ జుడీషియల్ డేటా గ్రిడ్ ప్లాట్‌ఫామ్ పరిధిలోకి సుప్రీంకోర్టు రానున్నట్లు భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్ర చూడ్ ఇవాళ ప్రకటించారు. ఈ గ్రిడ్ ద్వారా పెండింగ్‌లో ఉన్న కేసుల్ని ట్రాకింగ్ చేయవచ్చు అని ఆయన వెల్లడించారు. డేటా గ్రిడ్ మరింత పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచుతుందన్నారు. ఇది చరిత్రాత్మకమైన దినం అని, ఈ విశిష్టమైన ప్లాట్‌ఫామ్‌ను ఎన్ఐసీ డెవలప్ చేసిందని, సుప్రీంకోర్టు ఇన్‌హౌజ్ టీమ్ కూడా ఆ ప్రక్రియలో పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. బటన్‌ను క్లిక్ చేస్తే, రియల్ టైంలోనే ఆ పెండింగ్ కేసులకు చెందిన సమాచారం వచ్చేస్తుందని సీజే తెలిపారు.

ఏ సంవత్సరంలో ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి, ఎన్ని కేసులు రిజిస్టర్ అయ్యాయి, ఎన్ని కేసులు రిజిస్టర్ కాలేదన్న సమాచారం దాంట్లో ఉంటుందని సీజే చంద్రచూడ్ వెల్లడించారు.సుప్రీంకోర్టు వద్ద ప్రస్తుతం 80 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు చంద్రచూడ్ పేర్కొన్నారు.. ఇప్పటివరకు ఎన్‌జేడీజీ పరిధిలో సుప్రీంకోర్టు లేదు. సుప్రీం వద్ద మరో 15 వేల కేసులు రిజిస్టర్ కావడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ ఏడాది జూలైలో సుమారు 5వేల కేసుల్ని పరిష్కరిం చినట్లు ఆయన వెల్లడించారు. త్రిసభ్య ధర్మాసనాల ముందు సుమారు 583 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు ఆయన తెలిపారు. అయితే ఆ బెంచ్‌లు త్వరగా కేసుల్ని పరిష్కరించేలా చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు.డేటా క్లీనింగ్ చేపట్టాల్సి ఉందని, ఫిజికల్ రికార్డులకు.. డిజిటల్ డేటా మ్యాచ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. హైకోర్టులు, జిల్లా కోర్టులు ఇప్పటికే డిజిటల్ ఫార్మాట్‌లోకి వెళ్లినట్లు తెలిపారు.

## చిత్తూరు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం - నలుగురు దుర్మరణం..





చిత్తూరు, సెప్టెంబర్ 15:చిత్తూరు సమీపంలోని తెల్లగుండ్లపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందారు. సంఘటనా స్థలాన్ని వెస్ట్ సి ఐ రవిశంకర్ రెడ్డి పరిశీలించారు. శుక్రవారంఉదయం నాలుగు గంటల ప్రాంతంలో బెంగళూరు నుండి ఒంగోలుకు వెళ్తున్న ఆయిల్ టాంకర్ రోడ్డు వైపు నిలబెట్టి ఉండగా బెంగళూరు లోని విక్టోరియా ఆసుపత్రి నుండి నుంచి ఒరిస్సా కు వెళ్తున్న అంబులెన్స్ ఆయిల్ ట్యాంకర్ ను వెనక నుండి ఢీకొనడంతో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారని, నలుగురికి తీవ్ర గాయాలైనట్టు సి ఐ తెలిపారు .

ఈ ప్రమాదంలో మంజులత, త్రిలోచనా, ఉమేష్ చంద్ర, విజయ్ మృతి చెందారని, జతిన్.. దేబ భ్రత , అంబులెన్స్ డ్రైవర్ సంజయ్.. లారీ డ్రైవర్ శంకర్ లకు తీవ్ర గాయాలు అయినట్టు తెలిపారు ఈ ఘటన పైన కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. యాదమరి ఎస్సై సుమన్ , కాణిపాకం ఎస్సై శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాలను ప్రభుత్వాసుపత్రి కి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## బద్వేలులో రోడ్డు ప్రమాదం- ఇద్దరు మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు

అమరావతి, సెప్టెంబర్ 15: కడప జిల్లా బద్వేలు మండలం కొంగలవీడు సమీపంలో ఇవాళ రోడ్డుప్రమాదం చోటు చేసుకుంది. ఎదురెదురుగా వస్తున్న రెండు స్కూటర్లు ఢీ కొనడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. రెండు స్కూటర్లలో ఉన్న నలుగురు వ్యక్తులు కింద పడడం జరిగింది. వీరిలో ఇద్దరు వ్యక్తులపై వెనుక నుంచి వస్తున్న లారీ దూసుకెళ్లింది. ఈ సంఘటనలో ఇరువురు అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరికి తీవ్రగాయాల య్యాయి. మృతులు అట్లూరు మండలం గాండ్లపల్లెకు చెందిన రామ్ కుమార్, చిన్న పెంచలయ్యలుగా గుర్తించారు. గాయపడ్డ వారిని ప్రభుత్వా సుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రధాన మంత్రి 50,700 కోట్ల రూపాయలకు పైగా విలువ కలిగిన అభివృద్ధ ప్రాజెక్టులకు మధ్య ప్రదేశ్‌లోని బీనాలో శంకుస్థాపన

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 50,700 కోట్ల రూపాయల కు పైగా విలువల కలిగిన అభివృద్ధి ప్రాజెక్టుల కు మధ్య ప్రదేశ్ లోని బీనా లో ఈ రోజు న శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుల లో, దాదాపు గా 49,000 కోట్ల రూపాయల ఖర్చు తో అభివృద్ధి చేయనున్న భారత్ పెట్రోలియమ్ కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్) కు చెందిన బీనా రిఫైనరీ లోని పెట్రోకెమికల్ కాంప్లెక్స్; నర్మదపురం జిల్లా లో ఒక 'పవర్ ఎండ్ రిన్యూవబుల్ ఎనర్జీ మాన్యుఫాక్చరింగ్ జోన్'; ఇందౌర్ లో రెండు ఐటి పార్కులు; రత్ లామ్ లో ఒక మెగా ఇండస్ట్రియల్ పార్కు మరియు మధ్య ప్రదేశ్ లో వివిధ ప్రాంతాల లో ఆరు కొత్త ఇండస్ట్రియల్ ఏరియాస్ భాగం గా ఉన్నాయి.

ప్రధాన మంత్రి సభికుల ను ఉద్దేశించి ప్రసంగిస్తూ, బుందేల్ ఖండ్ యోధుల భూమి అని అభివర్ణించారు. ఒక నెల రోజుల లోపే మధ్య ప్రదేశ్ లోని సాగర్ ను సందర్శించిన సంగతి ని ఆయన ప్రస్తావిస్తూ, ఈ అవకాశాన్ని ఇచ్చినందుకు మధ్య ప్రదేశ్ ప్రభుత్వాని కి ధన్యవాదాల ను తెలియ జేశారు. సంత్ రవిదాస్ జీ యొక్క స్మారక కట్టడానికి శంకుస్థాపన కార్యక్రమం లో పాలుపంచుకోవడాన్ని కూడా ఆయన గుర్తు కు తెచ్చుకొన్నారు.

ఈ రోజు న తలపెట్టిన ప్రాజెక్టులు ఈ ప్రాంతం అభివృద్ధి కి క్రొత్త శక్తి ని ఇస్తాయి అని ప్రధాన మంత్రి అన్నారు. ఈ ప్రాజెక్టుల కు కేంద్ర ప్రభుత్వం ఏభై వేల కోట్ల రూపాయల ను ఖర్చు పెడుతోందని, ఈ సొమ్ము దేశం లో అనేక రాష్ట్రాల బడ్జెటు కంటే ఎక్కువని ఆయన అన్నారు. "ఇది మధ్య ప్రదేశ్ కోసం మాకు ఉన్న సంకల్పాలు ఎంత భారీవో తెలియజేస్తోంది." అని ఆయన అన్నారు.

స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం అమృత కాలం లో దేశం లో ప్రతి ఒక్క పౌరుడు/ ప్రతి ఒక్క పౌరురాలు భారతదేశాన్ని అభివృద్ధి చెందినటువంటి దేశం గా తీర్చిదిద్దాలన్న సంకల్పాన్ని చెప్పుకొన్నారు అని ప్రధాన మంత్రి అన్నారు. ఆత్మనిర్భర్ భారత్ కు ఉన్న ప్రాముఖ్యాన్ని ప్రధాన మంత్రి నొక్కి చెప్తూ, దిగుమతుల ను తగ్గించుకోవలసి ఉంది, ఇదే సందర్భం లో పెట్రోలు కోసం, డీజిల్ కోసం, ఇంకా పెట్రో రసాయనిక ఉత్పత్తుల కోసం భారతదేశం విదేశాల పైన ఆధారపడి వుంది అన్నారు. బీనా రిఫైనరీ లో పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ను గురించి శ్రీ నరేంద్ర మోదీ చెప్తూ, అది పెట్రో రసాయనాల సంబంధి పరిశ్రమ లో ఆత్మనిర్భరత దిశ లో వేస్తున్న ఒక ముందడుగు అవుతుందన్నారు. గొట్టాలు, నల్లాలు, గృహోపకరణాలు, పెయింట్, కారు భాగాలు, వైద్యచికిత్స సంబంధి పరికరాలు, ప్యాకేజింగ్ సామగ్రి మరియు వ్యవసాయం సంబంధి ఉపకరణాలు తదితర ప్లాస్టిక్ ఉత్పాదనల ను గురించిన ఉదాహరణల ను ఇస్తూ, వీటిని ఉత్పత్తి చేయడం లో పెట్రో రసాయనాల ది కీలకమైన పాత్ర అని వివరించారు. "బీనా రిఫైనరీ లో పెట్రోకెమికల్ కాంప్లెక్స్ యావత్తు ప్రాంతం లో వృద్ధి ని పెంచుతుంది, అభివృద్ధిని సరిక్రొత్త శిఖరాల కు తీసుకు పోతుంది అని మీకు నేను పూచీ ని ఇస్తున్నాను." అని ప్రధాన మంత్రి అన్నారు. అది క్రొత్త పరిశ్రమల కు దన్ను గా నిలవడం ఒక్కటే కాకుండా చిన్న రైతుల కు మరియు నవ పారిశ్రామికవేత్తల కు కూడా అవకాశాల ను కల్పిస్తుంది; అంతేకాదు, యువత కై వేల కొద్దీ అవకాశాల ను కూడా అందిస్తుంది అని ఆయన అన్నారు. తయారీ రంగాని కి ఉన్న ప్రాముఖ్యాన్ని గురించి ఆయన మాట్లాడుతూ, ఈ రోజు న పది నూతన పారిశ్రామిక ప్రాజెక్టు ల తాలూకు పనులు ఆరంభం అయ్యాయి అని తెలియ జేశారు. నర్మదపురం లో , ఇందౌర్ లో, రత్ లామ్ లో ప్రాజెక్టు లు మధ్య ప్రదేశ్ యొక్క పారిశ్రామిక సామర్థ్యాన్ని వృద్ధి చెందింప చేస్తాయి, తత్ఫలితం గా అన్ని వర్గాల కు మేలు జరుగుతుంది అని ఆయన అన్నారు.

ఏదయినా రాష్ట్రం గాని లేదా ఏదైనా దేశం గాని అభివృద్ధి చెందాలి అంటే పాలన లో పారదర్శకత్వాని కి మరియు అవినీతి ని అంతం చేయడాని కి పెద్దపీట ను వేయాలి అని ప్రధాన మంత్రి అన్నారు. మధ్య ప్రదేశ్ ను దేశం లో అత్యంత పెళుసైన మరియు బలహీనమైన రాష్ట్రాల లో ఒక రాష్ట్రం గా భావించిన కాలం అంటూ ఒకటి ఉండేది అని ప్రధాన మంత్రి గుర్తు కు తీసుకు వచ్చారు. "మధ్య ప్రదేశ్ ను దశాబ్దాల తరబడి పాలించిన వ్యక్తులు నేరం మరియు అవినీతి మినహా మరేదీ అందించ లేదు." అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. రాష్ట్రం లో నేరగాళ్ళు ఏ విధం గా ఇష్టారాజ్యం గా నడుచుకొన్నారో; శాంతి మరియు వ్యవస్థ ల పట్ల ప్రజల లో విశ్వాసం ఏ విధం గా లోపించిందో శ్రీ నరంద్ర మోదీ గుర్తు కు తెచ్చారు. ఆ తరహా పరిస్థితులు పరిశ్రమల ను రాష్ట్రం నుండి తరిమి వేశాయి అని ఆయన అన్నారు. మధ్య ప్రదేశ్ లో వర్తమాన ప్రభుత్వం మొదటి సారి ఎన్నిక అయిన తరువాత నుండి స్థితి ని మార్చడం కోసం అమిత ప్రయాసల కు పూనుకొంటూ వచ్చిన సంగతి ని ఆయన ప్రస్తావించారు. ప్రభుత్వ కార్యసాధనల ను గురించి ప్రధాన మంత్రి ప్రముఖం గా ప్రకటిస్తూ, శాంతి ని మరియు వ్యవస్థ ను పునరుద్ధరించడం, పౌరుల మనసుల లో గూడుకట్టుకొన్న భయాన్ని పారద్రోలడం, రహదారుల ను నిర్మించడం మరియు విద్యుచ్ఛక్తి సరఫరా ల ను గురించిన ఉదాహరణల ను ఇచ్చారు. మెరుగైన సంధానం రాష్ట్రం లో ఒక సకారాత్మక వాతావరణాన్ని ఏర్పరచింది. దీనితో కర్మాగారాల ను ఏర్పాటు చేయడం కోసం పెద్ద పరిశ్రమలు తయారు గా ఉన్నాయి అని ఆయన అన్నారు. మధ్య ప్రదేశ్ రాబోయే కొన్ని సంవత్సరాల లో పారిశ్రామిక అభివృద్ధి పరం గా క్రొత్త శిఖరాల ను చేరుకొంటుందన్న విశ్వాసాన్ని శ్రీ నరేంద్ర మోదీ వ్యక్తం చేశారు.

ఈ నాటి న్యూ భారత్ శరవేగం గా మార్పు చెందుతోంది అని ప్రధాన మంత్రి అన్నారు. ఈ సందర్భం లో బానిస మనస్తత్వం నుండి బయటపడాలని, 'సబ్ కా ప్రయాస్' (అందరి యత్నాల తో) ముందుకు దూసుకు పోవాలి అని తాను ఇచ్చిన పిలుపు ను గురించి ఆయన గుర్తు చేశారు. "భారతదేశం బానిస మనస్తత్వాన్ని విడచిపెట్టింది. మరి ప్రస్తుతం స్వతంత్రం తాలూకు విశ్వాసం తో ముందుకు పోవడం మొదలు పెట్టింది" అని ఆయన అన్నారు. ఇది ఇటీవలే నిర్వహించిన జి-20 సభల లో ప్రతిబింబించింది. జి-20 శిఖర సమ్మేళనం ప్రతి ఒక్కరి ఉద్యమం గా మారిపోయింది. మరి అందరూ దేశం యొక్క కార్యసిద్ధుల ను చూసుకొని గర్వపడ్డారు అని ఆయన అన్నారు. జి-20 మహత్తరమైన సాఫల్యాన్ని సాధించింది అంటే అందుకు ఖ్యాతి అంతా ప్రజల కు దక్కుతుంది అని ప్రధాన మంత్రి అన్నారు. "ఇది 140 కోట్ల మంది భారతీయుల సాఫల్యం" అని ఆయన అన్నారు. వేరు వేరు నగరాల లో ఏర్పాటైన కార్యక్రమాలు భారత్ యొక్క వైవిధ్యాన్ని మరియు సామర్థ్యాల ను చాటి చెప్పడం తో పాటుగా సందర్శకుల ను ఎంతగానో ఆకట్టుకొన్నా యి కూడాను అని ఆయన అన్నారు. ఖజురాహో, ఇందౌర్, ఇంకా భోపాల్ లలో జరిగిన జి-20 సంబంధి కార్యక్రమాల ప్రభావాన్ని గురించి ఆయన చెప్తూ, అవి ప్రపంచం దృష్టి లో మధ్య ప్రదేశ్ యొక్క ప్రతిష్ఠ మెరుగైంది అన్నారు.

ఒక ప్రక్కన న్యూ భారత్ ప్రపంచ దేశాల ను ఒక చోటు కు తీసుకు రావడం లో తన ప్రావీణ్యాన్ని ప్రదర్శిస్తూ 'విశ్వమిత్ర' గా తెర మీద కు వస్తుంటే, మరో ప్రక్కన కొన్ని సంస్థలు దేశాన్ని మరియు సమాజాన్ని విభజించాలని శతథా ప్రయత్నిస్తున్నాయి అని ప్రధాన మంత్రి అన్నారు. ఇటీవల ఏర్పాటు అయిన సంకీర్ణాన్ని గురించి ప్రధాన మంత్రి మాట్లాడుతూ, వారి విధానాలు భారతీయ విలువల పైన దాడి చేయడాని కి మరియు వేల సంవత్సరాల పాతదీ అందరిని ఒక్కటి గా కలిపేటటువంటిదీ అయిన భావజాలాన్ని, సిద్ధాంతాల ను మరియు సంప్రదాయాల ను ధ్వంసం చేయడాని కి పరిమితం అయ్యాయి అన్నారు. క్రొత్త గా ఏర్పడ్డ సంకీర్ణం సనాతనాని కి స్వస్తి పలకాలని కోరుకొంటోంది అని ప్రధాన మంత్రి చెప్తూ, దేవి అహిల్య బాయి హోల్కర్ గారు తన సామాజిక కార్యాల తో దేశం లో ధర్మాన్ని పరిరక్షించారు; ఝూన్సీ కి చెందిన రాణి లక్ష్మి బాయి గారు బ్రిటిషు వారి ని ఎదురించారు; గాంధీ మహాత్ముని అంటరానితనం ఉద్యమానికి భగవాన్ శ్రీరాముడు ద్వారా ప్రేరణ లభించింది; ఇక స్వామి వివేకనంద సమాజం లోని అనేక దురాచారాల విషయం లో ప్రజల ను చైతన్యవంతుల ను చేశారు; లోకమాన్య తిలక్ గారు భరత మాత ను రక్షించేందుకు నడుంకట్టారు, గణేశ్ పూజ కు స్వాతంత్ర్య ఉద్యమం తో అనుబంధం ఏర్పడేటట్లుగా చేశారు అని ప్రధాన మంత్రి ప్రస్తావించారు.

మహర్షి వాల్మీకి, శబరి మాత, పండిత రవిదాస్ వంటి మహనీయుల ప్రతిరూపమైన సనాతన శక్తి అనేకమంది స్వాతంత్ర్య సమర యోధులకు స్ఫూర్తినిచ్చిందని ప్రధానమంత్రి అన్నారు. భారతదేశాన్ని ఏకతాటిపై నిలిపిన సనాతన వ్యవస్థను ధ్వంసం చేయాలని ప్రయత్నిస్తున్న శక్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ప్రజలను హెచ్చరించారు. దేశ భక్తికి, ప్రజాసేవకు ప్రభుత్వం అంకితమైందని ఉద్ఘాటిస్తూ- అణగారిన వర్గాలకు పెద్దపీట వేయడమన్నది అవగాహనగల ప్రభుత్వానికి ప్రాథమిక సూత్రమని ఆయన అన్నారు. మహమ్మారి విజృంభించిన వేళ ప్రజలకు చేయూతనిస్తూ చేపట్టిన చర్యల్లో భాగంగా 80 కోట్ల మందికి ఉచితంగా ఆహారధాన్యాలు పంపిణీ చేయడాన్ని గుర్తుచేశారు.

ప్రధాని తన ప్రసంగం కొనసాగిస్తూ- "మధ్యప్రదేశ్ సరికొత్త ప్రగతి శిఖరాలకు చేరేలా మేం నిర్విరామంగా కృషి చేస్తున్నాం. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ జీవన సౌలభ్యం కల్పన, ఇంటింటా సౌభాగ్యం వెల్లివిరిసేలా చూడటం మా లక్ష్యాలు. ఈ హామీలను మోదీ నెరవేర్చడంపై సాక్ష్యాలు మీ ముందున్నాయి" అన్నారు. రాష్ట్రంలో పేదల కోసం 40 లక్షల పక్కా ఇళ్లు, మరుగుదొడ్లు నిర్మించడంతోపాటు ఉచిత వైద్యం, బ్యాంకు ఖాతాలు, పొగ రహిత వంటిళ్లు వంటి హామీలను నెరవేరుస్తున్నామని గుర్తుచేశారు. రాఖీ పండుగ సందర్భంగా వంటగ్యాస్ సిలిండర్ ధరను తగ్గించడాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. "దీనివల్ల ఉజ్వల లబ్ధిదారులైన సోదరీమణులు ఇప్పుడు రూ.400 తక్కువ ధరకు సిలిండర్ పొందుతున్నారు" అని ప్రధాని పేర్కొన్నారు. "కేంద్ర ప్రభుత్వం నిన్న మరో కీలక నిర్ణయం కూడా తీసుకుంది. దీని ప్రకారం దేశంలో మరో 75 లక్షల మంది అక్కచెల్లెళ్లకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు లభిస్తాయి. వంటగ్యాస్ సదుపాయం ప్రతి సోదరికీ చేరువ కావాలన్నదే మా లక్ష్యం" అని ప్రధానమంత్రి తెలిపారు.

ప్రభుత్వం తన ప్రతి హామీ నెరవేర్చేందుకు పూర్తి చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఆయన నొక్కిచెప్పారు. ప్రతి లబ్ధిదారుకూ సంపూర్ణ ప్రయోజనం లభించేలా దళారీ వ్యవస్థను నిర్మూలించడాన్ని ఆయన ఉదాహరించారు. అలాగే 'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' గురించి ప్రస్తావిస్తూ అర్హులైన ప్రతి రైతు బ్యాంకు ఖాతాకు నేరుగా రూ.28,000 దాకా నేరుగా బదిలీ అయినట్లు పేర్కొన్నారు. ఈ పథకం కోసం ప్రభుత్వం రూ.2,60,000 కోట్లకుపైగా నిధులు విడుదల చేసిందని ప్రధాని తెలిపారు. గడచిన 9 ఏళ్లలో రైతుల సాగుఖర్చులు తగ్గించే దిశగా ఎరువులు చౌకగా అందించడానికి కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షల కోట్లకుపైగా ఖర్చు చేసిందని ఆయన చెప్పారు. అమెరికాలో యూరియా బస్తాకు అక్కడి రైతు రూ.3000 వరకూ చెల్లిస్తుండగా మన దేశంలో రూ.300కన్నా తక్కువకే లభిస్తున్నదని గుర్తుచేశారు. గతంలో యూరియా కుంభకోణాల్లో రూ.వేల కోట్ల మేర ప్రజాధనం స్వాహా అయ్యేదని, అటువంటి యూరియా ఇవాళ అంతటా సులభంగా అందుబాటులో ఉందని పేర్కొన్నారు.

బుందేల్‌ఖండ్‌లో నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణంలో రెండు ఇంజన్ల ప్రభుత్వం కృషిని ప్రముఖంగా ప్రస్తావిస్తూ- "సాగునీటి ప్రాధాన్యం ఎంతటిదో బుందేల్‌ఖండ్ రైతులకన్నా ఎక్కువ తెలిసిన వారెవరు!" అని ప్రధాని వ్యాఖ్యానించారు. ముఖ్యంగా 'కెన్-బెత్వా' సంధాన కాలువ గురించి వివరిస్తూ- ఇది బుందేల్‌ఖండ్ సహా ఈ ప్రాంతంలోని అనేక జిల్లాల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని ఆయన అన్నారు. ప్రతి ఇంటికీ పైపులద్వారా నీటి సరఫరాకు ప్రభుత్వ కృషిని వెల్లడిస్తూ- కేవలం నాలుగేళ్లలోనే దేశవ్యాప్తంగా సుమారు 10 కోట్ల కొత్త కుటుంబాలకు కొళాయి నీటిని సరఫరా చేశామన్నారు.

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com
ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433
E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 16-9-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 సంపుటి :30 సంచిక: 38 పేజీలు:6 వెల: రూ.1/-


## మావోయిస్టు దీపక్‌రావును అరెస్ట్ చేశాం : డీజీపీ అంజనీకుమార్



హైదరాబాద్, సెప్టెంబర్ 15: సీపీఐ మావోయిస్టు పార్టీ భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు సందీప్ దీపక్‌రావును పోలీసులు అరెస్టు చేశారు. డీజీపీ అంజనీ కుమార్ శుక్రవారం విలేకరుల సమావేశంలో అరెస్టుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆయన అరెస్ట్ మావోయిస్టులకు పెద్ద ఎదురుదెబ్బ తెలిపారు. దీపకర్‌రావు పశ్చిమ కనుమల ప్రత్యేక జోనల్ కమిటీ కార్యదర్శిగా కొనసాగుతున్నారని, ఆయన పలువురు అగ్రనేతలతో దీపక్‌రావు సమావేశాలు జరిపారని పేర్కొన్నారు.

కర్ణాటక, తమిళనాడు, కేరళ ట్రైజంక్షన్ ఏరియాలో దీపక్‌రావు కీలకంగా ఉన్నారన్నారు. ఈ ఏడాది దీపక్‌రావు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని, రెండు మూడు రోజుల కిందట దీపక్‌రావు హైదరాబాద్‌కు వచ్చారని చెప్పారు. కచ్చితమైన సమాచారం మేరకు దీపక్‌రావును అరెస్టు చేసినట్లు వివరించారు. ఆయన కోసం మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, కర్ణాటక పోలీసులు గాలిస్తున్నారని, అలాగే ఎన్ఐఏ బృందాలు సైతం వెతుకుతున్నాయన్నారు. మహారాష్ట్ర దీపక్‌రావుపై రూ. 25లక్షల రివార్డ్‌ను ప్రకటించిందని వివరించారు. తెలంగాణలో మావోయిస్టుల కార్యకలాపాలు లేవని తెలిపారు.

దీపక్‌రావు మావోయిస్టు పార్టీలో కీలకంగా ఉన్నారని, ఆమెపై సైతం నిఘా పెట్టినట్లు వివరించారు. ఇదిలా ఉండగా కేరళ దీపక్‌రావును అనిల్, వికాస్ పేర్లతో పిలుస్తుంటారు. మహారాష్ట్ర థానే జిల్లా అంబర్‌నాథ్‌కు చెందిన దీపక్‌రావు గతంలో రెండుసార్లు అరెస్టయ్యాడు. ధూలే, బెంగళూరులోనూ అరెస్టయి జైలుకు వెళ్లివచ్చాడు. చాలాకాలం మహారాష్ట్రలో పనిచేసిన ఆయన 2019లో పాలకాడ్ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు నేత మణివాసగం మృతి తర్వాత 2020 నుంచి పశ్చిమ ఘాట్ కార్యకలాపాల్లో పాల్గొంటున్నారు.

## ఎమ్మెల్సీ కవితకు 26 వరకు సమన్లు జారీ చేయొద్దు.. ఈడీకి సుప్రీం ఆదేశం..

హైదరాబాద్, సెప్టెంబర్ 15: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఎమ్మెల్సీ కవితకు ఈ నెల 26వ తేదీ వరకు సమన్లు జారీ చేయొద్దని ఈడీని సుప్రీంకోర్టు ఆదేశించింది. నళినీ చిదంబరం తరహాలోనే తమకూ ఊరట కల్పించాలని కోర్టును కవిత కోరారు. కవిత పిటిషన్‌పై సుప్రీంకోర్టు ధర్మాసనం ఈడీ న్యాయవాది స్పందన కోరింది. తమకు అభ్యంతరం లేదని అదనపు సొలిసిటర్ జనరల్ కోర్టుకు తెలిపారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 26వ తేదీ వరకు సమన్లు జారీ చేయొద్దని జస్టిస్ కౌల్ ధర్మాసనం ఆదేశించింది.

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరోసారి నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. శుక్రవారం విచారణకు హాజరు కావాలని ఆ నోటీసుల్లో ఈడీ పేర్కొంది. దర్యాప్తు సంస్థలు మహిళలను ఇంటివద్దే విచారించాలని, సమయపాలన పాటించాలని కోరుతూ కవిత సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌పై విచారణ ఇంకా కొనసాగుతున్నది. ఈడీ ముందు కవిత ఇప్పటికే మూడుసార్లు హాజరై విచారణ ఎదుర్కొన్నారు. ఆమెకు వ్యతిరేకంగా ఇంతవరకు ఎటువంటి ఆధారాలను చూపలేకపోయినా మరోసారి నోటీసులు జారీ చేయడం వెనుక రాజకీయ కక్ష సాధింపు ఉన్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 17న కేంద్ర మంత్రి అమిత్‌షా రాష్ట్రానికి వస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వాన్ని విమర్శించడానికి ఆయనకు వేరే ఇతర అంశాలు లేకపోవడంతో ఈడీ ముందు కవిత హాజరును ఒక అస్త్రంగా మార్చుకొనేందుకే ఆమెకు నోటీసులు ఇప్పించినట్టు రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఎమ్మెల్సీ కవిత కూడా ఇవి పొలిటికల్ నోటీసులని, పెద్దగా పట్టించుకోనవసరం లేదని తేలికగా తీసిపారేశారు.

## ఒకేసారి 9 మెడికల్ కాలేజీలు ప్రారంభం..

# సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘట్టం ఇది : సీఎం కేసీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 15: తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఉజ్వలమైన దినం ఇది. ఒకే సారి 9 మెడికల్ కాలేజీలు ప్రారంభించుకోవడం.. సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ ఘట్టం అని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. ప్రగతి భవన్ నుంచి వర్చువల్ విధానంలో 9 మెడికల్ కాలేజీలను సీఎం కేసీఆర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ ప్రసంగించారు. ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొంటుంటాం. కానీ ఈ కార్యక్రమం చాలా ఆత్మసంతృప్తి కలిగే గొప్ప సన్నివేశం. ఎందుకంటే పరిపాలన చేతకాదు అని ఎగతాళి చేసిన పరిస్థితులను చూశాం. అటువంటి తెలంగాణలో ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసుకుంటున్నాం. ఈ సంవత్సరంలో దాదాపు 24 వరకు చేరుకున్నాం. గతంలో ఐదు మెడికల్ కాలేజీలు ఉంటే.. ఇవాళ ఆ సంఖ్య 26కు చేరింది. వచ్చే విద్యా సంవత్సరానికి 8 కాలేజీలు నూతనంగా ప్రారంభం కాబోతున్నాయి. వీటికి కేబినెట్ ఆమోదం కూడా లభించిందని సీఎం కేసీఆర్ తెలిపారు.

### 10 వేల మంది డాక్టర్లను ఉత్పత్తి చేయబోతున్నాం..

2014లో 2850 మెడికల్ సీట్లు ఉంటే 2023 నాటికి 8515 మెడికల్ సీట్లు ఉన్నాయని కేసీఆర్ తెలిపారు. ఈ సందర్భంగా వైద్యశాఖ మంత్రి, కార్యదర్శిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. 85 శాతం మెడికల్ సీట్లు తెలంగాణ బిడ్డలకే దక్కాలని పటిష్టంగా పోరాటం చేసి హైకోర్టులో విజయం సాధించాం. అది గొప్ప విజయం. ప్రయివేటు, గవర్నమెంట్ మెడికల్ కాలేజీల ద్వారా సంవత్సరానికి 10 వేల మంది డాక్టర్లను ఉత్పత్తి చేయబోతున్నాం అని కేసీఆర్ పేర్కొన్నారు.

### తెల్ల రక్త కణాల మాదిరిగానే తెలంగాణ తెల్ల కోట్ డాక్టర్లు పని చేస్తారు..

మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే, రోగ నిరోధక శక్తి ఉండాలంటే.. తెల్ల రక్త కణాలు ఏ విధంగా పని చేస్తాయో.. తెలంగాణ ఉత్పత్తి చేయబోయే తెల్ల కోట్ డాక్టర్లు రాష్ట్రానికే కాదే.. దేశ ఆరోగ్య వ్యవస్థను కూడా కాపాడుతారని కేసీఆర్ వివరించారు. ఇందులో ఎవరికి సందేహం లేదు.

తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోంది. విద్యుత్ రంగంతో పాటు సాగు, తాగునీటి రంగంలో అద్భుతాలు సాధించాం. దేశానికే అన్నం పెట్టే స్థాయికి ఎదిగాం. గంజి కేంద్రాలతో విలసిల్లిన ఉన్న పాలమూరు జిల్లాలో ఇప్పుడు వ్యవసాయం పరుగులు పెట్టింది. పాలమూరు ప్రాజెక్టు ప్రారంభించుకోబోతున్నాం. ఒక్క కాలేజీ లేని పాలమూరులో ఐదు మెడికల్ కాలేజీలు వచ్చాయి. ఇది గొప్ప విజయం. నల్లగొండలో మూడు కాలేజీలు వచ్చాయి. మారుమూల జిల్లాలైన ఆసిఫాబాద్, ములుగు, భూపాలపల్లి జిల్లాలు.. అలా అడవి బిడ్డలు నివసించే ప్రాంతాల్లో కూడా మెడికల్ కాలేజీలు స్థాపించుకొని అద్భుతాలు సృష్టించబోతున్నామని కేసీఆర్ తెలిపారు.

### 50 వేల పడకలకు చేరుకోబోతున్నాం..

ఒక దేశం కావొచ్చు.. రాష్ట్రం కావొచ్చు.. ఎక్కడైతే వైద్యారోగ్య వ్యవస్థ పటిష్టంగా ఉంటుందో.. అక్కడ తక్కువ మరణాలు, నష్టాలు సంభవిస్తాయని కేసీఆర్ తెలిపారు. దాన్ని స్ఫూర్తిగా తీసుకొని మెడికల్ కాలేజీలతో పాటు అద్భుతమైన ఆస్పత్రులను కూడా తీసుకువస్తున్నాం. వందలాది బెడ్స్‌తో మెడికల్ ఫెసిలిటీ వస్తుంది. వైద్యారోగ్య శాఖ చాలా విజయాలు సాధించింది.

దేశంలో ప్రతి లక్ష జనాభాకు 22 ఎంబీబీఎస్ సీట్లు ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ. ఇది మన సాధించిన ఘనత. రాష్ట్రం ఏర్పడే నాటికి 17 వేల పడకలు ఉంటే.. ఇప్పుడు 34 వేల పడకలకు చేరుకున్నాం. మరో 6 హాస్పిటల్స్ నిర్మాణంలో ఉన్నాయి. వరంగల్‌లో అద్భుతమైన హాస్పిటల్ నిర్మాణం జరుగుతోంది. హైదరాబాద్‌కు నలువైపులా టిమ్స్ నిర్మిస్తున్నాం. గచ్చిబౌలి, ఎల్బీ నగర్, అల్వాల్, ఎర్రగడ్డలో 1000 పడకల చొప్పున హాస్పిటల్స్ నిర్మిస్తున్నాం. నిమ్స్‌ను మరో 2 వేల పడకలతో విస్తరిస్తున్నాం. ఆస్పత్రుల్లో పడకల సంఖ్య 50 వేలకు చేరుకోబోతోంది. ఈ సందర్భంగా వైద్యారోగ్య శాఖను అభినందిస్తున్నాను అని కేసీఆర్ స్పష్టం చేశారు.

### 500 టన్నుల ఆక్సిజన్ ఉత్పత్తి..

కరోనా టైంలో ఆక్సిజన్ చాలా అవసరం ఉండే. దాన్ని గుణపాఠంగా తీసుకొని ఈరోజు వైద్యారోగ్య శాఖ మంత్రి నేతృత్వంలో 500 టన్నుల ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసుకుంటున్నాం అని కేసీఆర్ తెలిపారు. ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు మౌలిక సదుపాయాలు కల్పించుకున్నాం. 50 వేల పడకలను ఆక్సిజన్ బెడ్స్‌గా తీర్చిదిద్దుకుంటున్నాం. 10 వేల సూపర్ స్పెషాలిటీ బెడ్స్ కూడా అందుబాటులోకి వస్తున్నాయి. పారా మెడికల్ సిబ్బందికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఉంది. మెడికల్ కాలేజీలకు అనుబంధంగా.. ప్రతి జిల్లాలో నర్సింగ్ కాలేజీలు, పారా మెడికల్ కోర్సులు పెట్టాలని చెప్పాం. వాటికి కూడా చర్యలు తీసుకుంటున్నారని సీఎం తెలిపారు.

# చట్ట సభల్లో బీసీ, మహిళా రిజర్వేషన్ బిల్లులు ప్రవేశపెట్టాలి.. ప్రధాని మోదీకి సీఎం కేసీఆర్ లేఖ

హైదరాబాద్, సెప్టెంబర్ 15:చట్టసభల్లో బీసీలు, మహిళలకు రిజర్వేషన్ల బిల్లులు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి కేసీఆర్ లేఖలు రాశారు. చట్టసభల్లో బీసీలకు, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ తీర్మానం చేసింది. ఈ రెండు బిల్లులను 18 నుంచి జరగబోయే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ అధ్యక్షతన సమావేశమైన బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సంయుక్త సమావేశం ఏకగ్రీవంగా తీర్మానిస్తూ, ముక్త కంఠంతో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

ఈ సందర్భంగా బీసీ(ఓబీసీ) బిల్లు, మహిళా బిల్లు.. ఈ రెండు బిల్లులను పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టే దిశగా బీఆర్ఎస్ ఎంపీలు చేపట్టాల్సిన కార్యాచరణ సంబంధిత అంశాలపై పార్లమెంటరీ పార్టీ సుదీర్ఘంగా చర్చించింది. మహిళా సంక్షేమం, బీసీల అభ్యున్నతి కోసం బీఆర్ఎస్ పార్టీ కట్టుబడి వున్నదని, దేశవ్యాప్తంగా వారి హక్కులను కాపాడేందుకు కేంద్రాన్ని ఎప్పటికప్పుడు బీఆర్ఎస్ తన గళాన్ని వినిపిస్తునే ఉంటుందని స్పష్టం చేశారు. ఈ దిశగా పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో పార్టీ డిమాండ్లను రాజ్యసభ, లోక్‌సభల్లో ఎంపీలు లేవనెత్తాలని అధినేత సీఎం కేసీఆర్ సూచించారు. తమ గళాన్ని వినిపించాలని దిశానిర్దేశం చేశారు.

### బీసీ బిల్లుపై మోదీకి సీఎం కేసీఆర్ లేఖ

తమ తమ వృత్తులను తర తరాలుగా నిర్వర్తిస్తూ దేశ సంపద సృష్టిలో కీలక భాగస్వాములైన సబ్బండ వృత్తి కులాలైన బీసీలకు చట్టసభల్లో సముచిత ప్రాధాన్యత దిశగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సంయుక్త సమావేశం సుదీర్ఘంగా చర్చించింది. ఉత్పత్తిలో భాగస్వాములౌతూ, సభ్య సమాజానికి సేవలందిస్తూ, దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా వుంటున్న బీసీ (ఓబీసీ) కులాలను సామాజిక, విద్య, ఆర్థిక రంగాల్లో మరింత దేశవ్యాప్తంగా ముందుకు నడిపించాల్సిన బాధ్యత కేంద్రం ప్రభుత్వం మీద వున్నదని సమావేశం అభిప్రాయం వ్యక్తం చేసింది. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం బీసీల అభివృద్ధి సంక్షేమం దిశగా అమలు చేస్తున్న పథకాలు కార్యాచరణ సత్ఫలితాలనిస్తున్నాయని, అవి దేశానికే ఆదర్శంగా నిలిచాయని సమావేశం విశ్లేషించింది. ముఖ్యంగా.. రాజకీయ అధికారంలో బీసీల భాగస్వామ్యం మరింత పెంచడం ద్వారానే వారి సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ పునరుద్ఘాటించింది. అందులో భాగంగా బీసీ (ఓబీసీ)లకు పార్లమెంటు అసెంబ్లీ చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ ను అమలు చేయాల్సిందేనని ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ దిశగా ఈ పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టి చిత్తశుద్దిని నిరూపించుకోవాలని కేంద్రాన్ని డిమాండు చేసింది. కాగా.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయిన తర్వాత నిర్వహించిన మొదటి అసెంబ్లీ సెషన్‌లోనే(14 జూన్ 2014) బీసీ రిజర్వేషన్ బిల్లుపై చర్చించి ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపించిందనే విషయాన్ని సమావేశం గుర్తుచేస్తూ మరోసారి చర్చించింది. తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసి పంపి తొమ్మిదేండ్లు గడుస్తున్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మౌనం వహిస్తూ, బీసీ రిజర్వేషన్లపై తాత్సారం వహించడం పట్ల బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సామవేశం అసంతృప్తిని వ్యక్తం చేసింది. పార్లమెంటు, అసెంబ్లీ చట్టసభల్లో బీసీలకు సరియైన ప్రాధాన్యత దక్కినప్పుడే వారి సమ్మిళితాభివృద్ధి సాధ్యమౌతుందని పునరుద్ఘాటించింది. ఈ మేరకు బిల్లును ప్రవేశపెట్టాలని పార్లమెంటరీ పార్టీ సంయుక్త సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఇప్పటికైనా నిర్లక్ష్యం వహించకుండా బీసీ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి వారికి చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు ఆమోదం పొందే దిశగా చిత్తశుద్దితో చర్యలు చేపట్టాలని ఏకగ్రీవంగా తీర్మానిస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని సమావేశం మరోసారి డిమాండు చేసింది. సమావేశంలో చర్చించి తీసుకున్న నిర్ణయం మేరకు బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండు చేస్తూ.. బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ భారత ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు.

### మహిళా రిజర్వేషన్ కోసం ఏకగ్రీవ తీర్మానం

సమాజంలో సగభాగమైన మహిళలు అన్ని రంగాల్లో పురుషునితో సమానంగా రాణించినప్పుడే ఏ దేశమైనా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని అధినేత సీఎం కేసీఆర్ అధ్యక్షతన సమావేశమైన బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సంయుక్త సమావేశం పునరుద్ఘాటించింది. మహిళల్లో దాగివున్న శక్తిని వెలికితీసి వారికి సహకరిస్తూ వారిని అభివృద్ధిలో భాగస్వాములను చేసినప్పుడు మాత్రమే ఏ సమాజమైనా కూడా ప్రగతి పథంలో పయనిస్తుందనే వాస్తవాన్నిస్పష్టం చేసింది. ఈ దిశగా అభివృద్ధి చెందుతున్న దేశాలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న సోదాహరణలతో సహా విశ్లేషించింది. తెలంగాణ రాష్ట్రంలో మహిళా సంక్షేమం అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యాచరణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని సమావేశం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో.. మహిళల భాగస్వామ్యాన్ని రాజకీయ అధికారంలో కూడా మరింతగా పెంచేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కేంద్రాన్ని డిమాండు చేసింది. అందులో భాగంగా ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంటరీ ప్రత్యేక సమావేశాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేసే దిశగా బిల్లును ప్రవేశపెట్టాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ సంయుక్త సమావేశం ఏకగ్రీవంగా తీర్మానిస్తూ, కేంద్రాన్ని డిమాండు చేసింది.

కాగా? చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్ కోసం బిల్లును ప్రవేశపెట్టాలని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం మొట్ట మొదటి అసెంబ్లీ సమావేశాల్లోనే (14 జూన్ 2014) ఏకగ్రీవ తీర్మానం చేసి పంపిన విషయాన్ని కేంద్రం ఇంతవరకు పట్టించుకోకపోవడంపై సంయుక్త సమావేశం అసంతృప్తిని వ్యక్తం చేసింది. మహిళాభ్యున్నతి పట్ల చిత్తశుద్దిని ప్రదర్శిస్తూ పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో బిల్లు ఆమోదం పొందే విధంగా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని డిమాండు చేస్తూ బీఆర్ఎస్ పార్టీ సంయుక్త సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో చర్చించి తీసుకున్న నిర్ణయాల మేరకు పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి కేసీఆర్ భారత ప్రధాని నరేంద్ర మోదీకి మహిళా రిజర్వేషన్లపై లేఖ రాశారు.

## సూర్యాపేటను పర్యావరణహిత పట్టణంగా తీర్చిదిద్దుకుందాం: మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట, సెప్టెంబర్ 15: (నేటినిజం ప్రతినిధి): ఎప్పటిలాగే ఈ వినాయక చవితికి కూడా మట్టి విగ్రహాలను పెట్టుకుని పూజించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు పాటుపడుదామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి పిలుపునిచ్చారు. సూర్యాపేటను పర్యావరణహితమైన పట్టణంగా తీర్చిదిద్దుకుందామని చెప్పారు.

వినాయక నవరాత్రి పూజలను పురస్కరించుకుని సూర్యాపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవ కమిటీలకు ఇవాళ మట్టి విగ్రహాలను అందజేశారు.

మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తలో సూర్యాపేటకు ఇప్పటికే జాతీయ స్థాయి గుర్తింపు దక్కిందని చెప్పారు. ప్లాస్టిక్ నివారణ విషయంలో కూడా సూర్యాపేట ముందుండాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా మానవాళికి ప్లాస్టిక్‌తో ముప్పు పొంచి ఉన్నదని, ప్లాస్టిక్ నివారణ కోసం మనం చేయగలిగిన మేలు చేయాలని మంత్రి సూచించారు.

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన వినాయక విగ్రహాల నిమజ్జనం వల్ల నీరు కాలుష్యం అవుతుందని, ఆ నీటితో అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని మంత్రి తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల నీరు, భూమి, గాలి కలుషితమై క్యాన్సర్ వ్యాధులు వస్తాయని, అందుకే మట్టి విగ్రహాలు పెట్టుకోవాలని శాస్త్రవేత్తలు చెబుతున్నారని ఆయన పేర్కొన్నారు. గత తొమ్మిది సంవత్సరాలుగా సూర్యాపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీ జరుగుతున్నదని చెప్పారు.

ఉత్సవ కమిటీలు విధిగా మట్టి విగ్రహాలను పూజించాలని మంత్రి కోరారు. సూర్యాపేట మున్సిపాలిటీతోపాటు ఇంటిగ్రేటెడ్ మార్కెట్లలో అందుబాటులో ఉన్న మట్టి విగ్రహాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కొత్తగా సీడ్ విగ్రహాలను తయారు చేశారని, ఈ విగ్రహాలను ఇండ్లలో పూజించి భూమిలో నాటితే మొక్కలుగా పెరుగుతాయని, అలా చేస్తే పర్యావరణానికి ఎంతో మేలు చేసిన వారవుతారని మంత్రి పేర్కొన్నారు.

**నేటి కందం – నేటికి అందం**

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం



కం॥ మనుజుల భూగోళమ్ముపై
మనుగడ సాగించుకొరకు.. మహనీయుంబై
ఘనమగు ఓజోను పొరను
కంటికి భావించి - సతతం - కాపాడవలెను!!

( సెప్టెంబర్ 16 ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం..)

–రాధశ్రీ
సెల్:9494481210

## పేదలు ఆత్మగౌరవంతో జీవించాలనే డబుల్ బెడ్రూం ఇండ్లు : మంత్రి తలసాని

హైదరాబాద్, సెప్టెంబర్ 15:పేద ప్రజలు ఆత్మగౌరవంతో జీవించాలనే ఉద్దేశంతోనే వారికి డబుల్ బెడ్రూం ఇండ్లను ప్రభుత్వం నిర్మించి ఉచితంగా అందజేస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. హైదరాబాద్ కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో రెండో విడతలో భాగంగా ర్యాండమైజేషన్ సాఫ్ట్‌వేర్ విధానం ద్వారా ఆన్‌లైన్ డ్రా నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఆన్‌లైన్ లాటరీ ద్వారా డబుల్ బెడ్రూం ఇండ్లను లబ్ధిదారులకు కేటాయించారు. కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, నగర మేయర్ విజయ లక్ష్మి, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేశ్, అరికెపూడి గాంధీ, దానం నాగేందర్, ముఠా గోపాల్, ప్రకాశ్ గౌడ్, ఎమ్మెల్సీలు ప్రభాకర్, వాణీదేవి, మీర్జా రహమత్ బేగ్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రంగారెడ్డి కలెక్టర్ హరీశ్, మేడ్చల్ కలెక్టర్ అమోయ్ కుమార్ సమక్షంలో కార్యక్రమం సాగింది.




జీహెచ్ఎంసీ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో రెండో విడతగా 11,700 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు మంత్రి తెలిపారు. రెండో విడత ప్రక్రియలో దివ్యాంగులు, ఎస్సీ–ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించామన్నారు. దివ్యాంగులకు 470, ఎస్సీలకు 1,923, ఎస్టీలకు ఎస్టీలకు 655 కేటాయించగా.. ఇతరులకు 8,652 కేటాయించినట్లు వివరించారు.

కేటాయింపుల్లో ఎవరి జోక్యం లేకుండా పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు గొప్పగా బతకాలనే ఉద్దేశంతో డిమాండ్ ఉన్న ఏరియాల్లో ఇల్లు కట్టించి ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్, డీఆర్డీఓ వెంకటాచారి, హైదరాబాద్ ఆర్డీవోలు సూర్యప్రకాశ్, రవికుమార్, ఎన్ఐసీ అధికారులు పాల్గొన్నారు.

## ఒకేసారి 9 మెడికల్ కాలేజీలు ప్రారంభించుకోవడం.. సీఎం కేసీఆర్ పట్టుదలకు నిదర్శనం : మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 15:ఒక రాష్ట్రం ఒకేసారి 9 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రారంభించడం దేశ వైద్య రంగ చరిత్రలోనే మొదటిసారి.. ఇది సీఎం కేసిఆర్ పట్టుదలకు నిదర్శనం అని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. రాష్ట్రంలో 9 కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ తరగతులను ప్రగతి భవన్ నుండి వర్చువల్‌గా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీష్ రావు మాట్లాడారు. ఈరోజు రాష్ట్ర చరిత్రలో సుదినం. రాష్ట్రంలో పేదలకు విద్య, వైద్యం అందుబాటులోకి రావాలని ఆయన మార్గ నిర్దేశంలో ఇంత గొప్ప విజయాన్ని సాధించాం. గత సంవత్సరం 8 కాలేజీలు ప్రారంభించి తెలంగాణ కొత్త రికార్డు సృష్టించింది. ఈ సంవత్సరం మన రికార్డును మనమే అధిగమించాం. ఈ ఏడాది దేశ వ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో అందుబాటులోకి వచ్చిన ఎంబీబీఎస్ సీట్లలో తెలంగాణ వాటా 43 శాతం. ఇది గొప్ప రికార్డు. దేశంలోని మిగితా 27 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు కలిపి 57 శాతం సీట్లు మాత్రమే అందుబాటులోకి తెచ్చాయని హరీశ్‌రావు తెలిపారు.

### తెలంగాణ దేశానికే దిక్సూచిగా నిలిచింది..

మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు, 24 గంటల విద్యుత్తు సరఫరా, జిల్లాకో మెడికల్ కాలేజీ, రైతుబంధు వంటి కార్యక్రమాలతో మన రాష్ట్రం దేశానికే దిక్సూచిగా నిలిచిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఒకప్పుడు బెంగాల్ ఆలోచిస్తుంది.. దేశం అచరిస్తుంది అనే నానుడి ఉండేది. దాన్ని తిరగరాసిన ఘనత సీఎం కేసిఆర్‌ది. ప్రతి జిల్లాకు ఒక ప్రభుత్వ మెడికల్ కాలేజీ అని సీఎం కేసీఆర్ సంకల్పిస్తే.. దేశం మొత్తం అదే దారిలో నడుస్తున్నది. ఇప్పుడు తెలంగాణ అచరిస్తుంది.. దేశం అనుసరిస్తుంది అన్నంత గొప్పగా రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ ముందుకు తీసుకెళ్తున్నారు. ఉద్యమించి రాష్ట్రాన్ని సాధించుకోవడమే కాదు.. సాధించుకున్న రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌ది. ఈరోజు అడ్మిషన్లు పొందిన వైద్య విద్యార్థులకు శుభాకాంక్షలు. ఇంత గొప్ప పవిత్ర యజ్ఞంలో నాకూ భాగస్వామ్యం కల్పించినందుకు సీఎం కేసీఆర్ కు హృదయ పూర్వక ధన్యవాదాలు. నమస్కారం తెలుపుతూ హరీశ్‌రావు తన ప్రసంగాన్ని ముగించారు.

## ఏ సంస్థలో పేమెంట్ ఆలస్యమైందో చూపించాలి..!

### కేంద్రమంత్రి ఆర్కే సింగ్‌కు విద్యుత్ మంత్రి జగదీశ్‌రెడ్డి సవాల్..!

హైదరాబాద్, సెప్టెంబర్ 15:ఆర్థిక స్థోమత లేకనే తెలంగాణకు రుణాలు ఆపామంటూ కేంద్రమంత్రి ఆర్కే సింగ్ చేసిన వ్యాఖ్యలు విద్యుత్ మంత్రి జగదీశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఈ వ్యాఖ్యలు శతాబ్దంలోనే అతిపెద్ద అబద్ధమని విమర్శించారు. ఎర్రగడ్డ జెన్‌కో కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రైతుల మోటర్లకు మీటర్లు పెట్టలేదని తాము చెప్పలేదంటూ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. మీటర్లు పెట్టనందుకే నిధులు అపుతున్నామని కేంద్రం పంపిన ఉత్తరాలను ఎన్నోసార్లు ప్రభుత్వం ముందుంచామన్నారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలు చేసే పనులతో దేశానికి తీరని ద్రోహం జరుగుతుందని ఆరోపించారు. తీసుకున్న రుణాలను తిరిగి చెల్లిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందుందని, దమ్ముంటే ఏ ఒక్క సంస్థ దగ్గరైనా పేమెంట్ ఆలస్యమైందో ఆర్కే సింగ్ చూపించాలని సవాల్ విసిరారు.

తెలంగాణకు న్యాయంగా ఇవ్వాలని వాటా ఇవ్వకుండా.. రాష్ట్ర పేమెంట్ విధానికి ముగ్ధులై రుణాలు ఇచ్చేందుకు వచ్చిన ఆర్థిక సంస్థలను ఇవ్వకుండా భయపెడుతూ దుర్మార్గంగా కేంద్రం, మంత్రి ఆర్కేసింగ్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ నాయకత్వంలో అన్నిరంగాల్లో తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి సైతం కావాలంటూ బీజేపీ పాలితరాష్ట్రాల్లోని ప్రజల నుంచి వస్తున్న డిమాండ్‌తోనే బీజేపీ నేతలు అసత్యపు వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్ని అబద్ధాలు చెప్పినా కేసీఆర్ లక్ష్య శుద్ధిని ఆపలేరని స్పష్టం చేశారు. పైసలు ఇవ్వమంటూ భయపెట్టే ధోరణిలో ఆర్కే సింగ్ చేసిన వ్యాఖ్యలను తెలంగాణ సమాజం మరిచిపోదని, వాటా ఇవ్వకపోవడానికి తెలంగాణ ఆర్కే సింగ్ జాగీర్ కాదన్న మంత్రి.. తెలంగాణ ప్రజల హక్కు అన్నారు.




ప్రజలు చెల్లించిన పన్నులే అడుగుతున్నామని.. కొత్తగా ఏమీ అడగట్లేదన్నారు. తెలంగాణలో బీజేపీకి దిక్కులేదనే అక్కసుతో కేసీఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. దేశంలో మిగులు విద్యుత్ ఉన్నదనేది పెద్ద జోక్ అని, మిగులు విద్యుత్ ఉంటే ప్రధాని సొంత రాష్ట్రం గుజరాత్‌లో కరెంటు కోతలు ఎందుకు ఉన్నాయని ప్రశ్నించారు. రాత్రిపూట కరెంటు వాడితే 25శాతం సర్‌ఛార్జ్ విధిస్తామని కేంద్ర మంత్రి హోదాలో ఆర్కేసింగ్ చేసిన వ్యాఖ్యలు నిజం కాదా? అంటూ ప్రశ్నించారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా 24 గంటల కరెంటు ఇచ్చి తీరుతామని మంత్రి స్పష్టం చేశారు. అబద్ధాలు చెప్పే నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరని, అబద్ధాలు చెప్పేవారి ఎలా బుద్ధి చెప్పాలో తెలంగాణ ప్రజలు తెలుసునన్నారు.

# పేదవారికి మంచి జరగాలన్నదే మా ఆలోచన - జగన్




విజయనగరం, సెప్టెంబర్ 15: 'పేదవారికి మంచి జరగాలన్నదే మా ఆలోచన. ఏ చదువైనా పేదవారికి అందుబాటులో ఉండాలి' అన్నదే తమ ప్రభుత్వ లక్ష్యం అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. చదువులు భారం కాకూడదనే ఉద్దేశంతో నిరుపేదల పిల్లల ఉన్నత చదువుల బాధ్యతను తాము తీసుకున్నట్లు సీఎం వైఎస్ జగన్ వెల్లడించారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఐదు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను సీఎం వైఎస్ జగన్ ప్రారంభించారు. విజయనగరంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీని తన చేతుల మీదుగా ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్ అనంతరం వర్చువల్ విధానంలో రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాలలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయనగరం మెడికల్ కాలేజీలో ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కాలేజీ భవనంలోని వివిధ విభాగాలకు సంబంధించిన గదులను పరిశీలించి ట్రీట్‌మెంట్‌కు సంబంధించిన వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దివంగత వైఎస్ఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ? 17 మెడికల్ కాలేజీలో 5 మెడికల్ కాలేజీలు ఈ రోజు ప్రారంభిస్తుండడం సంతోషంగా ఉంది అని అన్నారు. వచ్చే ఏడాది మరో 5 కాలేజీలను ప్రారంభిస్తాం అని చెప్పుకొచ్చారు. ఆ మరుసటి ఏడాది మరో 7 కాలేజీలు ప్రారంభిస్తాం అని సీఎం వైఎస్ జగన్ తెలిపారు. పేదవాడికి మంచి చేస్తే దేవుడు కూడా ఆశీర్వదిస్తాడు అని సీఎం వైఎస్ జగన్ విద్యార్థులతో అన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ దాదాపు రూ. 8,480 కోట్ల వ్యయంతో 17 నూతన ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టామని సీఎం వైఎస్ జగన్ వెల్లడించారు. ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఉండేలా వేగంగా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని, వచ్చే విద్యా సంవత్సరంలో మరో ఐదు మెడికల్ కాలేజీలు, ఆ తర్వాత ఏడాదికి మిగతా ఏడు కాలేజీలలో అకడమిక్ తరగతులను ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు సీఎం వైఎస్ జగన్ తెలిపారు..

ఈ సందర్భంగా విద్యార్థులతో సీఎం వైఎస్ జగన్ ముచ్చటించారు. 'దేవుడి దయతో మంచి కార్యక్రమం చేస్తున్నాం. ఐదు మెడికల్ కాలేజీలు ప్రారంభిస్తుండడం సంతోషంగా ఉంది. రానున్న రోజుల్లో మీరంతా గొప్ప డాక్టర్లు కావాలి. మీరంతా అత్యున్నత స్థాయికి చేరుకోవాలి' అని సీఎం జగన్ విద్యార్థులకు తెలియజేశారు. స్వతంత్ర్యం వచ్చాక ఏపీలో కేవలం 11 మెడికల్ కాలేజీలే ఉన్నాయి. అందుకే ఈ 11 మెడికల్ కాలేజీలకు మరో 17 మెడికల్ కాలేజీలను చేర్చి 28 మెడికల్ కాలేజీల దిశగా అడుగులు వేస్తున్నాం అని సీఎం వైఎస్ జగన్ వెల్లడించారు.

ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఓ మెడికల్ కాలేజీ ఉండబోతోంది అని చెప్పుకొచ్చారు. ఇవాళ ఐదు మెడికల్ కాలేజీలు ప్రారంభించుకున్నాం. వచ్చే ఏడాది మరో ఐదు మెడికల్ కాలేజీలు ప్రారంభిస్తాం. ఆ మరుసటి ఏడాది మరో ఏడు కాలేజీలు ప్రారంభిస్తాం. ఈ 17 మెడికల్ కాలేజీలు వల్ల కొత్తగా 2,250 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి రానున్నాయి. దీంతో మొత్తంగా ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 4,735 సీట్లకు చేరుతుంది. ఈ ఒక్క ఏడాదే 609 పీజీ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. మంచి డాక్టర్లు అయ్యి ప్రజలకు ఉపయోగపడాలి. ఇదే నేను మీ నుంచి కోరుకుంటున్నా. అందుకే ఖర్చు ఎంతైనా వెనకాడడం లేదు అని సీఎం వైఎస్ జగన్ విద్యార్థుల నుంచి కోరారు. రాబోయే రోజుల్లో వెనకబడిన ప్రాంతాల్లో మెడికల్ కాలేజీలు వస్తాయి. గిరిజన ప్రాంతాలతో పాటు వైద్యసదుపాయాలకు దూరంగా మారుమూల ప్రాంతాల్లోనూ మెడికల్ కాలేజీల ఏర్పాటు ఉండనుందని సీఎం జగన్ చెప్పుకొచ్చారు. ఏపీ ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందాలి. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ తీసుకొచ్చాం. హెల్త్ సెక్టార్‌లో 53 వేలమందిని రిక్రూట్ చేశాం. కొత్తగా 18 నర్సింగ్ కాలేజీలను తీసుకొస్తున్నాం. ప్రస్తుత కాలేజీల్లో మౌలిక సదుపాయాల్ని మెరుగుపరుస్తాం. వైద్య రంగంలో ఖాళీ పోస్టులు భర్తీ చేస్తున్నాం అని సీఎం జగన్ వివరించారు. ఈ కార్యక్రమానికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, ఉపముఖ్యమంత్రి ,గిరిజన సంక్షేమశాఖ, పీడిక రాజన్నదొర, ఉపముఖ్యమంత్రి , పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఎబూడి ముత్యాలనాయుడు, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఎం.టీ కృష్ణబాబుతో పాటు పలువురు ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు

# పచ్చదనం మరింత పెంచాలి : పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్

హైదరాబాద్, సెప్టెంబర్ 15: తెలంగాణలో పచ్చదనం మరింత పెంచాలని పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్ అధికారులకు సూచించారు. అడవుల రక్షణ, నిర్వహణపై రెండు రోజుల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ హైదరాబాద్ దూలపల్లీ ఫారెస్ట్ అకాడెమిలో జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు చెందిన అధికారులు హాజరయ్యారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన అటవీ సంరక్షణ ప్రధాన అధికారి డోబ్రియాల్ శాఖ పనితీరు, నిర్వహణపై దిశానిర్దేశం చేశారు.అటవీ నిర్వహణలో ఈ ఏడాది లక్ష్యాలు, ఇప్పటి వరకు జరిగిన పనుల పురోగతిపై చర్చించారు. తొలిరోజు సదస్సులో తెలంగాణకు హరితహారం, అర్బన్ ఫారెస్ట్ పార్కుల నిర్వహణ, అటవీ సంరక్షణ చట్టం, అభివృద్ధి పనులకు అటవీ భూముల మళ్లింపు, అటవీ రక్షణ- విజిలెన్స్, రెండోరోజు పరిపాలన, ప్రత్యామ్నాయ అటవీకరణ (కంపా), ఎకో టూరిజం, ప్రొడక్షన్ తదితర అంశాలపై చర్చించారు.

# మంత్రుల సాక్షి గా శిలాఫలకంలో బిసి చైర్మన్‌లకు దక్కని చోటు



చిత్తూరు సెప్టెంబర్ 15:. బీసీ భవన్ ప్రారంభంలో బీసీలకు అవమానం జరిగింది. బీసీలకు 56 కార్పొరేషన్లు ఇచ్చామంటూ ప్రకటించుకున్న ప్రభుత్వం ఆ వర్గాలకు సముచిత స్థానం కల్పించడం లేదని విమర్శలు వస్తున్నాయితాజాగా శుక్రవారం చిత్తూరులోబీసీ భవనం ప్రారంభించారు.ఈ శిలాఫలకంలో బీసీ కార్పొరేషన్ చైర్మన్ లకి చోటు కల్పించలేకపోడం బాధాకరమని ఎన్నికైన చైర్మన్లు ఆవేదన చెందారు..బీసీల పట్ల వైసిపికి చిత్తశుద్ధి లేదని చర్చించుకుంటున్నారు. చిత్తూరు జిల్లా నుండి నలుగురు బీసీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్లు ఉన్నప్పటికీఎవరి పేరు ఈ శిలాఫలకంలో లేకపోవడం బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉందని విమర్శిస్తున్నారు.

ఈ విషయంపై విలేఖరులు బీసీ వెల్ఫేర్ ఈడి రబ్బానీ భాషా ను వివరణ కోరగా సమాధానాన్ని దాటవేస్తూ మళ్ళీ మాట్లాడుతానని మీడియాకు బ్రీఫ్ చేసి వెళ్లి పోయారు.

# పి.ఎం. గతి శక్తి కింద, జరిగిన 55వ నెట్ వర్క్ ప్లానింగ్ గ్రూప్ సమావేశంలో ఆరు మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల సిఫార్సు.

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15:నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూప్ (ఎన్‌పిజి) 55 వ సమావేశం 2023 సెప్టెంబర్ 12న న్యూఢిల్లీ?లో జరిగింది. ఈ సమావేశానికి పరిశ్రమల ప్రోత్సాహక, అంతర్గత వాణిజ్య విభాగం లాజిస్టిక్స్ ప్రత్యేక కార్యదర్శి శ్రీమతి సుమితా దావ్రా అధ్యక్షత వహించారు. ఇందులో సభ్య విభాగాలు, మంత్రిత్వ శాఖలు అంటే, రోడ్డు రవాణా, జాతీయ రహదారులు,పౌర విమానయానం , రైల్వే, పోర్టులు, షిప్పింగ్, జలరవాణా, విద్యుత్, నూతన పునరుత్పాదక ఇంధనం, పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పులు, టెలికమ్యూనికేషన్ ,నీతి ఆయోగ్ కు చెందిన వారు క్రియాశీలంగా పాల్గొన్నారు.

ఒక్కటిగా ప్రభుత్వ వ్యవస్థ అన్న విధానం ప్రాజెక్ట ప్రణాళిక రూపకల్పన,అమలుకు కొత్త కోణాన్ని అందించింది.ఇది ఎవరికి వారు అన్న విధానం కాకుండా అన్ని మంత్రిత్వ శాఖలు, విభాగాలు కలసికట్టుగా పనిచేసి ఫలితాలు సాధించే పద్ధతి ఏర్పడిరది. ఈ సమావేశంలో పి.ఎం. గతి శక్తి ప్రణాళిక వల్ల కలిగే వివిధ ప్రయో జనాలను వివరించడం జరిగింది. ఎన్.ఎం.పిపై డిజిటల్ సర్వే, తక్కువ సమయంలో డిపిఆర్ తయారీ, సమర్థవంతంగా ప్రాజెక్టులను సాంకేతికత అనుసంధానిత ప్లాట్‌ఫారంల ద్వారా గమనించడం, మౌలికసదుపాయాల ప్రాజెక్టుల , సామాజిక రంగ ఆస్తుల సమగ్ర ప్రణాళిక రూపొందించడం వంటి వాటి గురించి వివరించారు. ఇవి మంచి ఫలితాలనిచ్చాయి.

ఈ సమావేశం సందర్భంగా మొత్తం ఆరు ప్రాజెక్టులను అంచనా వేశారు. ఇందులో మూడు రైల్వే ప్రాజెక్టులు, మూడు ప్రాజెక్టులు రోడ్ ట్రాన్స్‌పోర్టు, జాతీయ రహదారులకు సంబంధించి ఉన్నాయి.ఈ ప్రాజెక్టుల మొత్తం అంచనా విలువ 14,081 కోట్ల రూపాయలు. దీనితో ఎన్.పి.జి పిఎం గతిశక్తి విధానాన్ని చేపట్టినప్పడినుంచి, అంచనా వేసిన మొత్తం ప్రాజెక్టుల సంఖ్య 106 కు చేరింది. వీటి మొత్తం అంచనా విలువ రూ 11 లక్షల కోట్లరూపాయలు.

ఎన్.పి.జి 55 వ సమావేశంలో మూడు రైల్వే లైను ప్రాజెక్టులను అంచనా వేశారు. వీటి మొత్తం వ్యయం 5,374.5 కోట్లు. ఇందులో ఒక గ్రీన్‌ఫీల్డ్ రైల్వేలైన్‌ప్రాజెక్టు అలైన్‌మెంటు పశ్చిమబెంగాల్, ఒడిషా, జార్ఖండ్ రాష్ట్రాలమీదుగా వెళుతుంది. మరోగ్రీన్‌ఫీల్డ్ రైల్వే లైను ఒడిషా లో ఉంది. ఇది ప్రస్తుత రైల్వే లైనుకు ప్రత్యామ్నాయ, దగ్గరి దూరం గల అలైన్‌మెంట్ అవుతుంది. ఇది ప్రస్తుత ట్రాక్‌పై రద్దీ తగ్గిస్తుంది. మూడో రైల్వేలైను గుజరాత్ రాష్ట్రంలో ఉంది. ఈ రైల్వేలైన్లు స్టీలు సిమెంటు, విద్యుత్ రంగాలకు ప్రయోజనం చేకూర్చనున్నాయి. ఇవి ఈ పరిశ్రమలకు బొగ్గు, సున్నపురాయి, ఇనుపఖనిజం తరలించడానికి, తయారైన ఉత్పత్తుల రవాణాకు అంటే ఇనుము, స్టీలు, సిమెంట్ తదితరాలను తరలించడానికి, అలాగే ప్రయాణికులను తరలించడానికి ఉపయోగపడుతుంది. ఈ రైల్వే ప్రాజెక్టులు మొత్తంగా లాజిస్టిక్స్ ఖర్చును తగ్గించనున్నాయి.తక్కువ దూరంగల మార్గాల ద్వారా సరకు తరలించడం , ట్రాఫిక్‌రద్దీని తగ్గించడం వల్ల ప్రస్తుత రైల్వే లైన్లపై భారంతగ్గుతుంది.

దీనితోపాటు ఎన్.పి.జి మూడు రోడ్డు ప్రాజెక్టుల గురించి కూడా చర్చించింది. వీటి మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ 8706 కోట్ల రూపాయలు. ఒక రోడ్డు ప్రాజెక్టు (ధుబ్రి బ్రిడ్జి‘గోయరాగ్రి) మేఘాలయలో ఉంది. ఇది తుబ్రి ‘ఫుల్‌బరి బ్రిడ్జిని తూర్పు‘పశ్చిమ రోడ్ కారిడార్‌తో అనుసంధానం చేస్తుంది. ఇది దేశంలోని ఈశాన్య ప్రాంతాన్ని సులభతర అనుసంధానంతో కలిపే లక్ష్యంలో భాగంగా చేపడుతున్న ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టు వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు మాత్రమే కాక, భారత 'బంగ్లాదేశ్ సరిహద్దులో అంతర్జాతీయ వాణిజ్యానికి కూడా వీలు కల్పిస్తుంది. మరో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ప్రాజెక్టు (ఖరగ్‌పూర్‘మోరెగ్రామ్) ఖరగ్‌పూర్‘ సిలిగురి రోడ్‌కారిడార్‌లో భాగంగా చేపడుతున్న ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టు ఖరగ్ పూర్‘ సిలిగురి మధ్య దూరాన్ని 112 కిలోమీటర్లు తగ్గిస్తుంది. అలాగే ప్రయాణ సమయాన్ని 7గంటలు తగ్గిస్తుంది. ఈ ప్రాజెక్టు మార్గంలోని ఆకాంక్షిత జిల్లాలకు ప్రయోజనం కలిగించడమే కాక, వామపక్ష తీవ్రవాద ప్రభావిత పశ్చిమ మిద్నపూర్ జిల్లాకు కూడా ప్రయోజనం కలిగిస్తుంది. ఈ ప్రాజెక్టు మొత్తంగా ఈ ప్రాంత సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి ఉపయోగపడుతుంది. ఈ రోడ్డు హాల్దియా, కోల్‌కతా పోర్టు ద్వారా అంతర్జాతీయ వాణిజ్యానికి ఉపకరిస్తుంది. మూడవ రోడ్డు ప్రాజెక్టు అయిన దియోఘర్ బైపాస్ సిటీ ట్రాఫిక్‌ను రద్దీని తగ్గించడానికి, స్థానిక పారిశ్రామిక పార్కులు, క్లస్టర్లకు ప్రయోజనం కలిగిస్తుంది.పి.ఎం. గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ మార్గదర్శకాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టులు ,సామాజిక ఆర్థిక పురోగతి, ఈ ప్రాంత అభివృద్ధి కోసం బహుళవక్ష అనుసంధానతను కల్పిస్తాయి. అలాగే ఈ ప్రాజెక్టులు ప్రస్తుత రైల్వే, రోడ్డు మార్గాలలో రద్దీని తగ్గించడంతోపాటు, నగరాలలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి ఉపయోగపడతాయి.

# వాటాదారుల వ్యాఖ్యల కోసం వినియోగదారుల సంస్థల (సవరణ) నిబంధనలు, 2023 ముసాయిదాను విడుదల చేసిన టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్)

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15: వినియోగదారుల సంఘాల నిబంధనలు 2013 (1 ఆఫ్ 2013) (ఇకపై ప్రధాన నిబంధనలుగా ప్రస్తావిస్తూ) సంఘాలను నమోదు చేసుకోవడానికి 21 ఫిబ్రవరి 2013న టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా ( టిఆర్ ఎఐ -ట్రాయ్) నోటిఫై చేసింది.

నిబంధనలలో ప్రస్తావించిన తమ పాత్రలను నిర్వహిస్తూ అథారిటీకి తోడ్పడేందుకు రాష్ట్రాలవారీగా ప్రధాన నిబంధనల కింద వినియోగదారుల సంఘాలను అథారిటీ ప్రస్తుతం నమోదు చేసుకుంటోంది.

వేగంగా పరిణామం చెందుతున్న డిజిటల్ చిత్రటంలో, 5జి, 6జి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఒటి) తదితర సాంకేతికతలు వినియోగదారుల జీవితాలను మెరుగుపరచడంలో అత్యంత సంభావ్యతను కలిగి ఉన్నాయి. ఈ సాంకేతికతలను ఉపయోగించడం అన్నది సమాజంలోని వివిధ వర్గాలకు తోడ్పడనుంది. వాస్తవ సమయంలో మార్కెట్ సమాచారాన్ని పొందడం, వనరుల నిర్వహణను అనుకూల పరచడం, పంట దిగుబడులను పెంచడం వంటి వివిధ అవకాశాలను ఎఐ ఒ ఐఒటి సమాజాలకు అందిస్తాయి. ఎఐ ఆధారిత వాతావరణ సూచనలతో పాటు ఐఒటి సెన్సార్ పరికరాలు రైతులు సరైన సమాచారంతో కూడిన వ్యవసాయ నిర్ణయాలు తీసుకోవడంలో తోడ్పడే అవకాశముంది.

5జి సామర్థ్యం కలిగిన హైస్పీడ్ అనుసంధానత అంతర్జాతీయ పోటీని పెంపొందించేందుకు, ఉత్పత్తి, సరఫరా గొలుసులు, వినియోగదారుల అనుభవాలను మెరుగుపరిచేందుకు ఎఐ ఆధారిత విశ్లేషణలతో వ్యాపారాలు, స్టార్టప్‌లకు సామర్థ్యాన్ని ఇస్తుంది.

మారుమూల ప్రాంతాల్లో మెరుగైన 5జి సేవల ద్వారా ఆన్‌లైన్ విద్య, రిమోట్ ఆరోగ్య సంరక్షణను, ఐఒటి ఆధారిత విపత్తు అంచనా, ప్రతిస్పందన వ్యవస్థలు పర్యావరణ సుస్థిరతను బలోపేతం చేసి, బడుగు, బలహీన వర్గాల సమూహాలకు విపత్తును ఎదుర్కొనే శక్తిని కల్పిస్తాయి. ఈ సాంకేతికతలను సమర్థవంతంగా ఉపయోగించినప్పుడు సమ్మిళిత వృద్ధిని పెంచి, ప్రాప్యతను మెరుగుపరిచి, సామాజిక -ఆర్థిక అంతరాలను తగ్గించగలవు.

ఈ అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల నుంచి పొందే ప్రయోజనాల గురించి అవగాహన పెంచడంలో వినియోగదారుల సంస్థలు సహాయక పాత్రను పోషిస్తాయి. ముఖ్యంగా బడుగు వరా?గలకు, గ్రామీణ ప్రాంతాలలో డిజిటల్ అంతరాన్ని పూడ్చేందుకు ఈ అవగాహనను కల్పిస్తాయి. ఈ ఇతివృత్త ఆధారిత కార్యక్రమాలను నిర్వహించేందుకు ఈ సంఘాలు ఈ సాంకేతికతల ఉపయోగాలను వివరించి, మహిళలు, రైతులు, బెస్తవారు, విద్యార్థులు తదితర వర్గాలకు సంభావ్య లాభాల గురించి అవగాహన పెంచడంలో, సైబర్ పారిశుద్ధ్యాన్ని ప్రచారం చేసి, డాటా గోప్యత గురించి వినియోగదారులలో చైతన్యాన్ని పెంచేందుకు ట్రాయ్‌కు తోడ్పడతాయి.

వివిధ రాష్ట్రాలు/ యుటిలలో ఉనికిని కలిగి ఉండి, ప్రచారం చేయడంలో, ఇతివృత్త ఆధారిత కార్యక్రమాలను నిర్వహించడంలో సామర్థ్యం, అనుభవం కలిగి ఉండటం ద్వారా అవగాహనా సామగ్రిని అభివృద్ధి చేయడం ద్వారా వినియోగదారులు, అథారిటీ మధ్య వినిమయ సీమను అందించగలిగే జాతీయ వినియోగదారు సంఘాలను నమోదు చేయవలసిన అవసరం ఉందని అథారిటీ భావించింది. ప్రతిపాదిత సవరణ జాతీయ స్థాయి నమోదులో ఐదు కంటే ఎక్కువ రాష్ట్రాలు/ యుటిలలో పని చేయడానికి విస్తృత పరిధితో సమర్థత కలిగిన వినియోగదారు సంస్థలను నమోదు చేయడానికి అథారిటీని అనుమతిస్తుంది. అంతేకాకుండా, ఇది అటువంటి వినియోగదారు సంస్థల నమోదు ప్రక్రియను సులభతరం చేస్తుంది. ముసాయిదా నిబంధన ట్రాయ్ వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. టిఆర్ఎఐ. జిఒవి. ఐఎన్ ( www.trai.gov.in )లో అందుబాటులో ఉండటమే కాక ఏవైనా స్పష్టీకరణల కోసం 4 అక్టోబర్ 2023 వరకు భాగస్వాముల అభిప్రాయాలను స్వాగతిస్తుంది. ట్రాయ్ సలహాదారు (సిఎఐ ఐటి) శ్రీ ఆనంద్‌కుమార్‌ను స్పష్టీకరణల కోసం టెలిఫోన్‌లో :011-23210990 కానీ లేదా ఇమెయిల్ advisorit@trai.gov.inలో ద్వారా కానీ సంప్రదించవచ్చు.

# కేరళలోని కోజికోడ్‌లో నిపా వైరస్ వ్యాప్తి నియంత్రణ కోసం అమలు జరుగుతున్న చర్యలను సమీక్షించిన కేంద్ర ఆరోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15:కేరళలోని కోజికోడ్‌లో నిపా వైరస్ వ్యాప్తి నియంత్రణ కోసం అమలు జరుగుతున్న చర్యలను కేంద్ర ఆరోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ సమీక్షించారు. పూణెలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ – నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఐసిఎంఆర్–ఎన్ఐవి) నుంచి ఈరోజు మంత్రి కేరళలోని కోజికోడ్‌లో నిపా వైరస్ వ్యాప్తి నియంత్రణ కోసం అమలు జరుగుతున్న చర్యలను సమీక్షించారు.

సమీక్ష అనంతరం మాట్లాడిన మంత్రి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం పరిస్థితిని సమీక్షించి తగిన చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉందని డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ తెలిపారు. వ్యాధి నివారణకు అవసరమైన అన్ని చర్యలు అమలు చేస్తామని అన్నారు.

కేంద్ర ఆరోగ్య మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో పరీక్షలు నిర్వహించడానికి 3 బిఎస్ఎల్ ల్యాబ్‌లతో కేంద్ర, ఐసిఎంఆర్ బృందాలు కోజికోడ్ చేరుకున్నాయని డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ వెల్లడించారు. మొబైల్ యూనిట్లతో బిఎస్ఎల్ కూడిన ల్యాబ్స్ క్షేత్ర స్థాయిలో పరీక్షలు నిర్వహిస్తాయి. కోజికోడ్ ప్రాంతంలో వ్యాధి గుర్తించినగ్రామ పంచాయతీలను క్వారంటైన్ జోన్‌లుగా ప్రకటించినట్లు ఆమె ప్రకటించారు. ఈ వ్యాప్తిని ఎదుర్కోవటానికి ప్రజారోగ్య చర్యలలో రాష్ట్రానికి పూర్తి సహకారం అందించడానికి డాక్టర్ మాలా ఛబ్రా నేతృత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖల ప్రతినిధులతో ఒక బృందాన్ని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నియమించింది.

కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ, ఐసిఎంఆర్-ఎన్ఐవి ప్రతిరోజూ ఈ సమస్యను పర్యవేక్షిస్తున్నాయి. వైరల్ వ్యాప్తిని ఎదుర్కోవటానికి కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేసిందని కేంద్ర మంత్రి తెలిపారు.

# కాంగ్రెస్ ను వీడి గులాబీ గూటికి.. ఆహ్వానించిన ఎమ్మెల్యే దాసరి



కరీంనగర్, సెప్టెంబర్ 15: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పెద్దపల్లి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధికి ఆకర్షితులై పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆ పార్టీకి గుడ్ బై చెప్పి గులాబీ గూటికి చేరారు. ఇవాళ పెద్దపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాల్వ శ్రీరాంపూర్ మండలం జాఫర్ ఖాన్ పేట్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులకు ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి కండువా కప్పి బీఆర్ఎస్ లోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ. ప్రపంచంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో అమలు చేసి పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. గత పాలకుల హయాంలో పెద్దపల్లి నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని, గత తొమ్మిదేళ్లలో 40ఏళ్లలో జరగని అభివృద్ధి చేసి చూపామన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి వేలాది కోట్ల రూపాయలు మంజూరు చేశారన్నారు. రైతు బంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్లు, దళిత బంధు, బీసీ బంధు లాంటి ఎన్నో పథకాలను తమ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ప్రతిపక్ష పార్టీల మాయమాటలు నమ్మే పరిస్థితిలో పెద్దపల్లి ప్రజలు లేరని, రాబోయే ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన అడ్డూరి సమ్మయ్య, పొట్ల లస్మయ్య, పొట్ల సాగర్, కర్రి మల్లేష్, కర్రి రమేష్, లసెట్టి రాజమల్లు, దొమ్మటి కుమార్, అంకటి తిరుపతి, తిప్ప శ్రీనివాస్, తిప్ప రాజయ్య, పురెల్ల కిష్టయ్య, దొమ్మటి మహేందర్, అంకతి రాజగట్టు, దొమ్మటి రాంచందర్, గడ్డం రఘుపతి, గడ్డం రమేష్ లు భారత రాష్ట్ర సమితి లో చేరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దొమ్మటి శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు ఆదే చంద్రయ్య, యూత్ అధ్యక్షుడు తిప్పని శ్రావణ్, కో ఆప్షన్ బోడకుంట పోచాలు, కారుకూరి సుధాకర్, బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

# ప్రశాంతంగా ముగిసిన టెట్ పేపర్-1.. సబ్జెక్టు నిపుణులు రూపొందించిన 'కీ' విడుదల

హైదరాబాద్, సెప్టెంబర్ 15:తెలంగాణ వ్యాప్తంగా ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) పేపర్-1 ప్రశాంతంగా ముగిసింది. శుక్రవారం ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1 పరీక్ష జరిగింది.

ఈ పరీక్షకు 2 లక్షల 50 వేల మందికి పైగా హాజరైనట్లు తెలుస్తోంది. అయితే పేపర్-1కు సంబంధించిన కీని నమస్తే తెలంగాణ నిపుణ ఆధ్వర్యంలో.. సబ్జెక్టు నిపుణుల చేత రూపొందించారు. ఈ కీని అభ్యర్థుల అవగాహన కోసమే విడుదల చేస్తున్నట్లు సబ్జెక్టు నిపుణులు పేర్కొన్నారు. స్కూల్ ఎడ్యుకేషన్ విడుదల చేసే కీనే ఫైనల్ అవుతుందన్నారు.

# అంగన్వాడీల వినూత్న నిరసన



నల్గొండ, సెప్టెంబర్ 15:అంగన్వాడీలు చేపట్టిన దేశవ్యాప్త నిరోధక సమ్మెలో భాగంగా ఐదో రోజు శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్తు కార్యాలయం ఎదుట మోకాళ్ళపై నిలబడి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకురాలు బొలిశెట్టి భాస్కరమ్మ మాట్లాడుతూ? అంగన్వాడీలను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ. 26,000 అందించాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తూ పెన్షన్ పెంచాలని, తమ నాయకులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చలు జరిపి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు మంజుల, జయమ్మ, జానీ బేగం, లలిత, మంగమ్మ, లక్ష్మమ్మ, నిర్మల, ఊర్మిళ, విజయ, సుజాత, నాగమణి, మణి, నాగలక్ష్మి, బుజమ్మ, జానకి పాల్గొన్నారు.

# ఎల్ఐసి పాలసీలపై జీఎస్టీని రద్దు చేయాలి

అమరావతి, సెప్టెంబర్ 15: ఎల్ఐసి పాలసీలపై జీఎస్టీని రద్దు చేయాలని లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు రణవీర్ శర్మ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేపటి నుంచి మూడు రోజులపాటు విజయవాడ నగరంలో ఎల్ఐసి ఏజెంట్స్ జాతీయ మహాసభలు నిర్వహిం చనున్నట్లు ఆయన శుక్రవారం ప్రకటించారు. నగరంలోని ఒక హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ? నగరంలోని ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్లో నేటి నుంచి మూడు రోజులపాటు తమ అసోసియేషన్ జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా 3,000 మంది ఎల్ఐసి ఏజెంట్స్ ఈ జాతీయ మహాసభల్లో పాల్గొంటారని ఆయన తెలియజేశారు. ఎల్ఐసి సంస్థ అభివృద్ధికి, ఏజెంట్స్ సమస్యల పరిష్కారానికి సంబంధించిన పలు అంశాలపై ఈ జాతీయ మహాసభల్లో చర్చించి భవిష్యత్తు ప్రణాళిక ను రూపొందించనున్నట్లు ఆయన వివరించారు.ఏజెంట్స్ కు సరైన ఉద్యోగ భద్రత లేకపోవడం వలన ఏజెంట్స్ వృత్తిని కొనసాగించలేని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలసీదారులకు ఇచ్చే బోనస్ ను పెంచాలని, పాలసీదారులకు ఎక్కువ బోనస్ ఇస్తే మరింత మంది ఎల్ఐసి పట్ల ఆకర్షితులవుతారని ఆయన పేర్కొన్నారు. ఒకవేళ ప్రీమియం చెల్లింపులు ఆలస్యమైతే పాలసీలపై వసూలు చేస్తున్న వడ్డీరేట్లను తగ్గించాలని ఆయన ఎల్ఐసి సంస్థకు సూచించారు. ఎల్ఐసి రంగంలో వస్తున్న ఆదాయంలో సింహభాగం ఏజెన్సీ ద్వారానే వస్తోందని, అయితే ఏజెంట్స్ కు సరిగా రిటర్న్స్ ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ డెవలప్మెంట్ అథారిటీ సూచనల మేరకు ఐదు శాతం ఉన్న కమిషన్ ను 7.5శాతంకు వెంటనే పెంచాలని ఆయన కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చాలా కాలంగా అపరిష్కృతంగా ఉన్న ఏజెంట్ గ్రాడ్యుటీని వెంటనే పెంచాలని ఆయన డిమాండ్ చేశారు .ఇన్సూరెన్స్ రంగాన్ని మరింత తగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంతో పాటు ఎల్ఐసి సంస్థపై ఉందని ఆయన సూచించారు. అనంతరం లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి గజపతి రావు, సౌత్ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు మార్కండేయులు మాట్లాడుతూ నేటి నుంచి ఎ ప్లస్ కన్వెన్షన్ లో జరిగే జాతీయ మహాసభలకు తొలి రోజున ముఖ్య అతిథులుగా బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు, వైసీపీ ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ డాక్టర్ జి సుధాకర్ బాబు విచ్చేయున్నారని వివరించారు. రెండో రోజున జరిగే సభకు ముఖ్య అతిథులుగా ఎంపీలు వంగా గీత, కేసినేని నాని విచ్చేసి ప్రసంగిస్తారని పేర్కొన్నారు. మూడో రోజున ఎల్ఐసి రంగం అభివృద్ధికి ఏజెంట్స్ సమస్యల పరిష్కారంపై చర్చించి భవిష్యత్ ప్రణాళికను రూపొందిస్తామని వివరించారు.

